ఆదివారం
ప్రజాశక్తి
జూన్ 22, 2003



ఆహ్లాదం - ఆరోగ్యం

హ్యాపీ బర్త్‌డే

(22-6-2003 నుండి 28-6-2003 వరకు)

కె.అమూల్య
5సం॥, 22.6.1998
రమాదేవి-అంజనేయులు
ఒంగోలు

నీలం వివేక్
1సం॥, 23.6.2002
ఉపేంద్ర- వెంకటయ్య
నల్లగొండ

తేజశ్వి
7సం॥, 27.6.1996
మాధవి-గణేష్‌కుమార్
ఉక్కునగరం-విశాఖపట్నం

ఎం.అమృత
జూన్-23
బేబి-పద్మరాజ్
సాలూరు-విజయనగరం

పురం మేఘన
3సం॥, 26.6.2000
చైతన్య-శ్రీనివాస్
మిర్యాలగూడ-నల్లగొండ

అదండీ సంగతి

మంత్రాలకు చింతకాయలు రాలవు. చింతకాయలు రాలాలంటే రాయో, కర్రో విసరాల్సిందే. మహామహా మాయగాళ్లు కూడా మంత్రాలకు చింతకాయలు రాలవనే సామెత నిజం కాదని రుజువు చేసే ప్రయత్నం చేయలేదు. నోటిలోంచి, అరచేతుల్లోంచి విభూది, లింగాలు, ఉంగరాలు పుట్టించే పుట్టపర్తి సాయిబాబా కూడా ఎప్పుడూ ఆ పని చేయలేదు. చింతచెట్టు కింద నిలబడి మంత్రాలు చదివి చింతకాయలు రాల్చలేదు. ఆయన లాంటి 'బాబా'లు మనకు వేలకువేలున్నా ఎవరూ ఆ పని చేయలేదు. ఈ బాపతంతా గుట్టు బయటపడేదాకా పేరు ప్రఖ్యాతులు, గుట్టురట్టయితే అపఖ్యాతులు రంగారెడ్డి జిల్లాలో ఒకస్వామి ఉండే వాడు. జబ్బుపడిన వారికి చికిత్సలు చేసేవాడు. తన దగ్గరికి వచ్చిన మహిళలను వంటిమీద నూలుపోగు లేకుండా రమ్మని నిలబెట్టి పూజలు చేయించేవాడు. మీ ఇంట్లో ఎవరైనా జబ్బుపడితే ఏం చేస్తారు. ఇలాగే పూజలు చేయిస్తారా అని విలేకరులు అడిగితే అబ్బేలేదు, ఆస్పత్రికి తీసుకెళ్తాను చికిత్స చేయిస్తాను అని సెలవిచ్చాడు. తన ఇంట్లో వాళ్ళకి తన వైద్యం పనిచేయదన్నాడు. పెరటి మొక్క వైద్యానికి పనికిరాదన్నాడు. మహానుభావులు మన తాతముత్తాతలు. అన్నింటికీ సామెతలు చెప్పేసి వెళ్ళిపోయారు. ఈ మధ్యనే వరంగల్ జిల్లాలో మరోస్వామి పత్రికలకెక్కారు. టీవీల్లో కన్పించారు. ఆస్వామి పేరే కుచమర్దనస్వామి. పిల్లలు పుట్టని స్త్రీలకు చికిత్స చేస్తారు. ఆ పేర ఆయన స్త్రీల శరీర భాగాలను స్పృశిస్తారు. మర్దన చేస్తారు. అదేమంటే తనకు మహిమలున్నాయంటారు. ఇలాంటి స్వాములు మనకు రాష్ట్రమంతటా తగుల్తారు. కొందరు గుట్టుగా, కొందరు ఆడంబరంగా కార్యకలాపాలు సాగిస్తుంటారు. జనం నెత్తిన కుచ్చుటోపీలు పెడ్తారు. బొచ్చూడగొడ్తారు. లక్షలు కోట్లు సంపాదిస్తారు. స్వాములమన్న పేర భూములు కాజేస్తారు. నానా దుష్ట చర్యలు అవలీలగా చేస్తుంటారు. మన సర్కారోళ్లు కళ్లప్పగించి సేస్తుంటారు. కొండకచోట అపరభక్తులై ప్రవర్తిస్తుంటారు. అప్పుడప్పుడు తేరుకొని హడావిడి చేసినా అంతలోనే ఆదమరిచి కళ్ళప్పగించి చూస్తారు. పుట్టపర్తికి వెళ్తుంటారు. లెంపలేసుకొంటారు. సాగిలపడ్తుంటారు. చేపమందుకూ మేము రెడీ అంటూ ముందుంటారు. చేపమందుకు శాస్త్రీయ నిరూపణ ఏది అని గట్టిగా ప్రశ్నిస్తే, మందిచ్చే ఛాయలకు కూడా రాకుండా తప్పించుకు తిరుగుతారు. ఇక మందు ప్రదాతలేమో ఇది మహామునులు ప్రసాదించిన రహస్యమంటారు. దీనికి శాస్త్ర పరీక్షలేమిటని దబాయిస్తారు. ప్రభుత్వం వారు కిక్కురుమనరు. నిజానికి మంత్రాలకు చింతకాయలు రాలవనే సత్యంలో మన ప్రభుత్వానికి నమ్మకం లేదు. చింతకాయలేం ఖర్మ ఏకంగా కరిమబ్బుల్నే రప్పించగలం, కుండపోతగా కురిపించగలం అని దాని నమ్మకం. అందుకే దేవాదాయ శాఖ వర్షాకాలం ఆరంభం కాబోతుందనగానే ఓ తాకీదు జారీ చేసింది. అన్ని దేవళాల్లో వాన కోసం పూజలు చేయమని ఆర్డర్ వేసింది. రాజు తలుచుకొంటే దేనికి కొదవ? వానల కోసం పూజలు మొదలయ్యాయి. అదేం విచిత్రమో గానీ గబగబా తరలివస్తున్న మేఘాలు మందగమనం మొదలెట్టాయి. సరిహద్దుల్లో ఆగిపోయి రావాలా వద్దా అంటూ సందేహించాయి. గడువుకు ముందే మహానాడుపై ప్రతాపం చూపిన వానాగాలి అంతటితో తన పని అయిపోయినట్లు మళ్ళీ మొహం చూపడం లేదు. జనం గుండెలు జారుతున్నాయి. పోనీ ఉగాది నాటి పంచాంగ శ్రవణంపై భరోసా ఉంచుదామంటే అదీ కుదరదు. నిరుడు పంచాంగంలో పచ్చపచ్చగా చూపెట్టారు. మొదట్లో మొరాయించినా ఆ తర్వాత వర్షాలు నిండుగా కురుస్తాయని చెప్పారు. వేదిక మీదున్న ముఖ్యమంత్రి, మంత్రిగణం, సభలోని జనం ఆ మాట విని ఖుషీఖుషీ అయ్యారు. అయ్యవారిని ప్రశంసించారు. కొందరు ముఖ్యమంత్రిని అభినందించారు. అంతా మీ చలవ అన్నారు. తీరా చూస్తే ఎప్పుడూ లేనంత అనావృష్టి. పంచాంగాన్ని నమ్మేదెలా. గత ఏడాది మాట ఎలా ఉన్నా ఈ ఏడాది పుష్కలంగా వానలు కురుస్తాయని జ్యోతిష్కుల జోస్యం. ఏదేమైనా దేవాదాయ శాఖ మంత్రి మాత్రం మహాచతురుడు. వర్షాకాలం మొదట్లోనే ఆయన వానల కోసం పూజలు చేయమని ఉత్తర్వులు జారీ చేశారు. వర్షాలు కురిసేనా ఆయన ఖాతాలో ప్లస్‌పాయింట్లు పడతాయి. లేదా మన ఖర్మ అని జనం సరిపెట్టుకుంటారు. అదండీ సంగతి. ◆

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
కవర్‌స్టోరీ . . . 3
ఆరోగ్యం . . . 6
జీవనశైలి . . . 8
గేయలహరి . . . 9
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
కచేరి . . . 14
టూరిస్ట్‌గైడ్ . . . 16
క్రీడారంగం . . . 17
రియల్ స్టోరీ . . . 20
కళాసాహితి . . . 21
పలుకుబడి 24
వగైరా . . . .

ఇంకా...

పిల్లలకూ సొంత అభిప్రాయాలుంటాయి
బాలవికాసం . . . 10

తాయారమ్మ థియరీ..
'ఇంతి' సంగతులు . . . 15

మెరుపు
కథ . . . 18, 19



ఆత్మీయతకు రూపం ఎం. హెచ్.
వ్యక్తిత్వం . . .22, 23





బదిలీ ఉత్తర్వుల్లో కంప్యూటర్ పొరపాటు జరిగిందని వాళ్ళు చెబుతున్నారు. అతనిని అక్కడకు మార్చగా. నన్ను ఇక్కడకు మార్చారు.

కనబడకుండా పోయిన ఉత్తరం కోసం మేము అన్ని చోట్లా గాలించాము. కానీ దొరకలేదు సార్. ఎట్టకేలకు దాన్ని పట్టుకోగలిగాం. అది మీ టేబుల్ మీదే ఉంది సార్.

ఆహ్లాదం.. ఆరోగ్యం...

పర్యాటకులను ఆకర్షిస్తున్న ఆయుర్వేదం

ఒక ప్రాంతంలోని ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాల గురించి ఇతర ప్రాంతాల వారు తెలుసుకునేందుకు పర్యాటక రంగం దోహదం చేస్తుంది. ఈ రకంగా ఆయా ప్రాంతాల ప్రజల మధ్య ఐక్యతను సాధించి దేశ సమగ్రతకు ఈ రంగం తోడ్పడుతుంది. అయితే ఆయా దేశాల్లో టూరిజానికి వుండే డిమాండ్ అనేక రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి వుంటుంది. 90వ దశకానికి ముందు కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సామాజిక టూరిజం భావన పర్యాటక రంగంలో డిమాండ్‌కు తోడ్పడింది. సోవియట్ యూనియన్‌తో సహా పలు దేశాలు ఈ సోషల్ టూరిజాన్ని ఇతోధికంగా ప్రోత్సహించాయి. పౌరులకు పర్యటనకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వాలే సమకూర్చేవి. మన దేశంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్‌టిసి సదుపాయం కల్పించి టూరిజాన్ని ప్రోత్సహించే విధానానికి ఈ విధానాలే స్ఫూర్తి. ఆర్థిక సంస్కరణల అమలు ప్రారంభించిన తరువాత ఈ సదుపాయానికి కోత పడింది. దీనితో పర్యాటక రంగంలో కొత్త కోణాలను అన్వేషించటం ప్రారంభించారు. ఈ అన్వేషణ ఫలితంగా ఆరోగ్య పర్యాటక రంగం అన్న కొత్త భావన ఉద్భవించింది. ఆరోగ్యాన్ని పర్యాటక రంగంతో జోడించటం ఈ భావనలో విశేషం.

*** వి.వి.వరప్రసాద్**

ఆరోగ్యంగా జీవించే హక్కు ప్రతి ఒక్కరి సొంతం. అది ప్రకృతి ప్రసాదించిన వరం. అందరికీ ఆరోగ్య భద్రత కల్పించటం ప్రభుత్వాల సామాజిక బాధ్యత. స్వాతంత్ర్యానంతరం నుండి 80వ దశకం వరకు సుమారు మూడు దశాబ్దాల పాటు ప్రభుత్వాలు ఈ బాధ్యతను కొంత వరకు నెరవేర్చేందుకు ప్రయత్నించాయి. అయితే 80వ దశకం తరువాత చోటు చేసుకున్న మార్పుల్లో ఈ అంశంలో వెనుకంజ వేయటం ప్రారంభించాయి. ఆర్థిక సంస్కరణలు అమలు కావటం ప్రారంభించిన తరువాత ప్రభుత్వాలు తమ బాధ్యత నుండి వైదొలిగే ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఈ కారణంగా ప్రజలకు వైద్యం అందని మానిపండయింది. ఇదే సమయంలో ప్రత్యామ్నాయ వైద్య విధానాల వైపు మొగ్గు చూపటం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటిగా భావించిన పర్యాటక రంగాన్ని ఆరోగ్యంతో జోడించి 'ఆరోగ్య పర్యాటకం' (హెల్త్ టూరిజం) అనే కొత్త అంశాన్ని ప్రచారంలోకి తీసుకు వచ్చింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా పర్యాటక స్థలాల్లో ఆరోగ్య కేంద్రాలను ప్రోత్సహించటం ప్రారంభించాయి. ఈ ఆరోగ్య కేంద్రాల్లో అధికశాతం ప్రకృతి పరమైన ఆయుర్వేద చికిత్సకు ప్రాధాన్యత నిస్తున్నారు. ముఖ్యంగా కేరళ, గోవా, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, బెంగాల్, యుపి వంటి ప్రభుత్వాలు ఈ హెల్త్ టూరిజం రంగాన్ని ఎక్కువగా ప్రోత్సహించటం ప్రారంభించాయి.

దేశంలోని పర్యాటక స్థలాల్లో కేరళ ప్రకృతి

సౌందర్యానికి పెట్టింది పేరు. కొచ్చిన్, పాలక్కాడ్, తిరువనంతపురం, కాలికట్, క్విలన్, కొట్టాయం తదితర పర్యాటక కేంద్రాల్లో అత్యంత అరుదైన ఆయుర్వేద వైద్య విధానాలు అందుబాటులో వుండి పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. హెల్త్ టూరిజం ద్వారా ప్రభుత్వం ఈ వైద్య విధానాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. పర్యాటక రంగం ద్వారా ప్రభుత్వానికి లభించే రెవిన్యూలో 40 శాతం మేర ఈ వైద్య విధానాల ద్వారానే లభిస్తోంది. ప్రధాని వాజ్‌పేయితో సహా పలువురు నేతలను ఈ వైద్య విధానాలు ఆకర్షించటం విశేషం. వీటికి లభిస్తున్న ఆదరణను గమనించిన ప్రభుత్వం పర్యాటకులను ఆకర్షించేందుకు ఆయా ప్రాంతాల్లోని వైద్య కేంద్రాల వద్ద పలు సౌకర్యాలు కల్పించింది. ఈ ప్రోత్సాహంతో పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయం 6.29 శాతం మేర పెరగగలదని కేరళ ప్రభుత్వం అంచనా వేస్తోంది. పర్యాటక కేంద్రాల్లో నెలకొల్పిన ఆరోగ్య కేంద్రాలు చైనా, గ్రీస్ తదితర దేశాల్లో అనుసరించే ప్రకృతి చికిత్సా విధానాలను ఇక్కడ ప్రవేశపెట్టి పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. కేరళ పర్యాటక కేంద్రాల్లో అనుసరిస్తున్న వైద్య విధానాల్లో పంచకర్మ చికిత్స, యోగాభ్యాసం, కస్తూర్యాది, గోరోచేడి, కొంపన్‌చాడి, ధన్వంతరి వంటి వైద్య పద్ధతులు ఇక్కడ అత్యంత ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుతం కేరళలో ఆరోగ్య ప్రమాణాలు అభివృద్ధి చెందిన దేశాలతో దీటుగా ఉన్నాయి. దీనితో ఐక్య రాజ్యసమితి కేరళను అభివృద్ధి చెందుతున్న మూడవ ప్రపంచ దేశాలకు ఒక నమూనా ప్రదేశంగా ప్రకటించింది. కేరళలోని ప్రతి చిన్న పట్టణంలోనూ, పల్లెటూళ్ళలోనూ వున్న ప్రభుత్వ డిస్పెన్సరీలు ప్రజలకు ఆరోగ్య భద్రతను సమకూరుస్తున్నాయి. అలాగే జిల్లా కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఆరోగ్య సేవలనందిస్తున్నాయి.



దేశంలో పర్యాటకులను ఆకర్షిస్తున్న గోవాలో హెల్త్ టూరిజంను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారు. ఈ రంగంలో ప్రధానంగా ఆయుర్వేద వైద్య విధానానికి గోవా విశేష ప్రాచుర్యం కల్పిస్తోంది. ఇక్కడ ఆయుర్వేద వైద్యానికి కేరి గ్రామం ప్రసిద్ధి చెందింది. ఈ గ్రామానికి చెందిన డా.దాదా వైద్య (1859-1947) తన మూలికా వైద్యంతో ఆనాటి పోర్చుగీసు పాలనాధికారులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలందించారు. అప్పటికే ప్రపంచంలోని అన్ని వైద్యపద్ధతులను ఆశ్రయించి విఫలమైన ఈ అధికారులు ఈ మూలికా వైద్య విధానంతో పూర్తి ఆరోగ్య వంతులు కావటం విశేషం. అందుకు కృతజ్ఞతగా పోర్చుగీసు ప్రభుత్వం పాండా సిటీ సెంట్రల్ స్క్వేర్‌లో డా.వైద్య విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. ఇంతటి ప్రాచుర్యం పొందిన ఆయుర్వేద వైద్య విధానాలతో పర్యాటకులను ఆకర్షించేందుకు గోవా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. పనాజీ, మార్మగోవా తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హెల్త్ రిసార్ట్‌లను ఏర్పాటు చేసి పర్యాటకులకు వైద్య సేవలందిస్తున్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో హెల్త్ టూరిజం రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఒక పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఆయుర్వేద వైద్య చికిత్సా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 3.25 కోట్ల రూపాయల వ్యయంతో టూరిస్టు హోటళ్ళలో పంచకర్మ చికిత్స అందించే ప్రాజెక్టును ప్రారంభించారు. రాష్ట్రంలోని చైల్, పాలంపూర్, జోగీందర్‌పూర్, కులు, తదితర ప్రాంతాల్లోని టూరిస్టు రిసార్ట్‌లలో ఈ వైద్య చికిత్సా విధానాలు పర్యాటకులకు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రంలో వున్న ఆయుర్వేద నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు, ఆయుర్వేద వనాలను విస్తృతంగా పెంచేందుకు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఉత్తర ప్రదేశ్‌లో పర్యాటక రంగం ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే ప్రధాన రంగాలలో ఒకటి. ఈ రంగాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు యుపి ప్రభుత్వం హెల్త్ టూరిజానికి పెద్దపీట వేస్తోంది. రాష్ట్రంలోని లక్నో, హరిద్వార్, వారణాసి, తదితర పర్యాటక కేంద్రాల్లో హెల్త్ రిసార్ట్‌లను ఏర్పాటు చేసి పర్యాటకులకు వైద్య సేవలందిస్తున్నారు. లక్నోలోని బొటానికల్ గార్డెన్స్‌లో పలు రకాలైన వనమూలికలను పెంచి ఆయుర్వేద వైద్య విధానానికి విస్తృతంగా ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ గార్డెన్స్ లక్నో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

హెల్త్ టూరిజం రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్న మరో రాష్ట్రం కర్నాటక. బెంగుళూరు నగరంలో పర్యాటకులను ఆకర్షించేందుకు బొటానికల్ గార్డెన్స్‌ను అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రాన్ని సందర్శించే పర్యాటకులకు వివిధ ఆస్పత్రులలో ఆధునిక వైద్య సేవలతో పాటు ఆయా టూరిస్ట్ కేంద్రాల్లో ప్రాచీన భారతీయ వైద్య విధానాలను కూడా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. మైసూరులోని బృందావన్ గార్డెన్స్ వద్ద నిర్మిస్తున్న హెల్త్ రిసార్ట్స్ పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా తీర్చి దిద్దుతున్నారు.

తమిళనాడు ప్రభుత్వం రాష్ట్రంలో హెల్త్ టూరిజం రంగానికి పెద్ద పీట వేస్తోంది. చెన్నయి నగరంతో పాటు రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలయిన ఊటీ, కొడైకెనాల్, మధురై, కన్యాకుమారి, తదితర నగరాల్లో హెల్త్ రిసార్ట్‌ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తూ పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది.

బెంగాల్ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకుల

సంప్రదాయంతో ఆధునికత మేళవింపు

సంప్రదాయ వైద్య రీతులను ఆధునిక వైద్య విధానాలతో మేళవించి చికిత్స అందచేయటం హైదరాబాద్ నగర ప్రత్యేకత. ఇక్కడ అధునాతన వైద్య పరికరాలతో కూడిన ఆధునిక వైద్య శాలలు అనేకం వున్నాయి. శాస్త్రవేత్తగా ప్రసిద్ధి చెందిన ప్రస్తుత రాష్ట్రపతి డా.ఎపిజె అబ్దుల్ కలామ్ ఇక్కడి టెలిమెడిసిన్ వంటి వైద్య విధానాలతో అనుబంధం కలిగి వుండటం విశేషం. పలు లాభేతర సంస్థలు స్థాపించిన ఆధునిక వైద్య శాలలు ప్రజలకు విశిష్టమైన వైద్య సేవలందిస్తున్నాయి. హెల్త్ టూరిజంను ప్రోత్సహించటంలో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ప్రవేశపెట్టిన గ్రీట్ అండ్ ట్రీట్ కార్యక్రమంలో రాష్ట్రంలో అల్లోపతి వైద్య విధానంతో పాటు పలు భారతీయ వైద్య విధానాలను అందుబాటులోకి తీసుకు వచ్చారు. గల్ఫ్ దేశాలకు చెందిన వేలాది మంది రోగులు ఈ పథకం కింద హైదరాబాద్‌ను సందర్శించి చికిత్సలు పొంది సంపూర్ణ ఆరోగ్యంతో స్వదేశాలకు తిరిగి వెళ్తున్నారు.

ఆకర్షణ కోసం కోల్‌కతా, డార్జిలింగ్‌లలో హెల్త్ రిసార్ట్స్ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోంది. ఉత్తరాంచల్ ప్రభుత్వం కూడా తన పరిధిలోని నైనిటాల్, డెహ్రాడూన్ తదితర ప్రాంతాల్లో హెల్త్ రిసార్ట్స్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా హెల్త్ టూరిజం రంగానికి ప్రోత్సాహాన్నందిస్తోంది. అయితే ఈ ప్రోత్సాహం ప్రభుత్వం రంగంలోకాకుండా ప్రైవేటు రంగంలో ప్రోత్సహిస్తుండటం విశేషం. రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున హెల్త్ రిసార్ట్‌ల నిర్మాణం కొనసాగుతోంది. విశాఖపట్నంలో ప్రభుత్వ రంగంలో కింగ్‌జార్జి ఆస్పత్రి, ఆంధ్రా యూనివర్శిటీ వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రులు ప్రధానంగా వైద్య సేవలందిస్తుండగా ప్రైవేటు రంగంలో అనేక కార్పొరేట్ ఆస్పత్రులు ప్రారంభమయ్యాయి. నగరాన్ని సందర్శించే పర్యాటకులకు ఈ ఆస్పత్రుల ద్వారా వైద్య సేవలందుతున్నాయి. విశాఖకు 12 కి.మీ దూరంలోని రిషికొండ, అరకు లోయలు తమ ప్రకృతి సౌందర్యంతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇక్కడకి వచ్చే పర్యాటకులకు ఆరోగ్య సేవలందించేందుకు ప్రైవేట్ రంగంలో హెల్త్ రిసార్ట్‌ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ హెల్త్ టూరిజం రంగంలో విజయవాడకు ప్రభుత్వం తగినంత ప్రోత్సాహాన్ని అందించటం లేదన్నది పర్యాటకుల ఆరోపణ. ఇక్కడ నగరాన్ని సందర్శించే పర్యాటకులకు ప్రధానంగా ఆరోగ్య సేవలందించేందుకు తగిన వసతులు లేవు. ఇక్కడికిసమీపంలోని మంగళగిరి ప్రముఖ పర్యాటక కేంద్రమే కాక ఇక్కడి వాతావరణం ఆరోగ్యకరమైనదిగా ప్రజలు భావిస్తుంటారు. ఈ కారణం వల్లే మంగళగిరిలో కొండల మధ్య అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం టి.బి శానిటోరియం నెలకొల్పి క్షయ రోగులకు వైద్య సేవలందించే ఏర్పాటు చేసింది. కానీ ఇటీవలి కాలంలో ఈ శానిటోరియం మూతపడిపోవటంతో ఇక్కడ హెల్త్ టూరిజం అనే మాటకు అర్థం లేకుండా పోయింది. రాష్ట్రంలో పర్యాటకులను ఆకర్షించే మరో పర్యాటక కేంద్రం పుట్టపర్తి. ఇక్కడకు దేశ, విదేశాల నుండి పర్యాటకులు వస్తుండటం విశేషం. ఇక్కడి ప్రజలతో పాటు పర్యాటకులకు కావల్సిన వైద్యసేవలను సత్యసాయి జనరల్ ఆస్పత్రి అందిస్తోంది. ఈ ఆస్పత్రిలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలందించటం విశేషం. మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందిస్తోంది. రాష్ట్రంలో ఆరోగ్య పర్యాటక కేంద్రంగా చెప్పుకోదగిన స్థలం చిత్తూరు జిల్లా గుర్రం కొండ (హార్స్‌లీహిల్స్). ఇక్కడ కూడా ప్రధానంగా క్షయ రోగులకు వైద్య చికిత్స లభిస్తుంది. ఇక్కడ ప్రకృతి పరంగా మంచి ఆరోగ్యం పొందేందుకు అవకాశాలుండటంతో ఇక్కడ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రకృతి చికిత్సకు పెద్దపీట వేస్తున్నారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం రిసార్ట్‌లను నెలకొల్పే ప్రయత్నం చేస్తోంది. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను హెల్త్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడ వైద్య సేవలందించేందుకు ప్రభుత్వ రంగంలో ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, గాంధీ జనరల్ ఆస్పత్రి, మహావీర్ వైద్య పరిశోధనా కేంద్రం, నీలోఫర్ ఆస్పత్రి, చార్మినార్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాల, తదితర ఆస్పత్రులున్నాయి. ఇక ప్రైవేట్ రంగంలో సైతం వైద్య, ఆరోగ్య సేవలందించేందుకు పలు ఆస్పత్రులున్నాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు నగరంలోని టూరిస్ట్ రిసార్ట్‌లో వైద్య చికిత్సలను అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. అంతే కాక ఆరోగ్య ప్రదమైన జీవనానికి ఆయా హోటళ్ళలో మసాజ్ సెంటర్‌లు, ప్రకృతి వైద్య కేంద్రాలు, తదితర ఆకర్షణలు కూడా జోడిస్తున్నారు. అంతే కాక ఇక్కడ వైద్య పరిశోధనా సంస్థలు అనేకం వున్నాయి. ప్రభుత్వ రంగంలో సిసిఎంబి (సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ) వంటి సంస్థలతో పాటు ప్రైవేటు రంగంలో శాంతా బయోటెక్, రెడ్డీల్యాబ్స్, భారత్ బయోటెక్ ఇన్‌స్టిట్యూట్ తదితర సంస్థలున్నాయి.

ఒక సమయంలో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో పర్యాటక రంగం ఒక పరిశ్రమగా గుర్తింపు పొంది అనేక మందికి ఉపాధి కల్పించింది. 90వ దశకం తరువాత కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులు పెరగటంతో పర్యాటకుల సంఖ్య తగ్గిపోయి చివరకు ఆ రంగమే కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ పర్యాటక రంగానికి తిరిగి పూర్వ వైభవాన్ని కల్పించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ◆



సాంప్రదాయక వైద్యంపై పెరుగుతున్న క్రేజు

అక్షర క్రమంలో అగ్రస్థానంలో వున్న ఆంధ్రప్రదేశ్ పలు రంగాల్లో అగ్ర స్థానానికి పోటీ పడుతోంది. అతిథులను ఆత్మీయంగా పలకరించి ఆప్యాయంగా ఆతిథ్యం ఇచ్చే విషయంలో ఆంధ్రా ప్రజలది పైచేయి అనటంలో సందేహం లేదు. పర్యాటకులు ఆంధ్రప్రదేశ్ వైపు మొగ్గు చూపటానికి కారణం కూడా ఇదే. అపూర్వమైన ఈ అతిథి మర్యాదల అనుభవానికి తోడు సంపూర్ణ ఆరోగ్యాన్నందించే సంప్రదాయ చికిత్సా పద్ధతులను హెల్త్ టూరిజం ద్వారా అందచేసే ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతాలు, పర్వత ప్రాంతాల్లో అనేక వనమూలికలు లభ్యం అవుతున్నాయి. రాజధాని నగర శివార్లలో నూతనంగా ప్రారంభించిన బొటానికల్ గార్డెన్స్‌లో కూడా పలు రకాల వనమూలికలు లభిస్తున్నాయి. ఈ మూలికా వైద్య విధానాలను ప్రోత్సహించటంతో పాటు ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన పంచకర్మ చికిత్స వంటి వైద్య విధానాలు కూడా జంటనగరాల్లో అందుబాటులో వున్నాయి. నల్లమల అటవీ ప్రాంతాలు, కొండపల్లి పర్వత ప్రాంతాల్లో లభించే వనమూలికలతో కొన్ని ఫార్మాస్యూటికల్ సంస్థలు ఆయుర్వేద ఔషధాలను తయారు చేస్తున్నాయి. ఈ ఔషధాలు దేశం అంతటా విస్తృతంగా ఉపయోగింపబడటమే కాక, ఎయిడ్స్, క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులకు చికిత్సలో ఉపయోగింపబడుతున్నాయి. ఈ మందుల సామర్థ్యంపై జామ్‌నగర్ ఆయుర్వేదిక్ యూనివర్శిటీ పరిశోధనలు కొనసాగిస్తుండటం విశేషం.

మూత్రకోశంలో రాళ్ళు

* డాక్టర్ సిహెచ్. సతీష్‌కుమార్
కన్సల్టెంట్ యూరాలజిస్ట్.

మూత్రపిండంలోను (కిడ్నీ), పిత్తాశయం (గాల్‌బ్లాడర్)లో రాళ్ళు ఏర్పడటం గురించి చాలామంది వినే ఉంటారు. కాని మూత్రకోశంలో కూడా రాళ్ళు ఏర్పడతాయన్న విషయం చాలామందికి తెలియదు. మూత్రకోశంలో ఏర్పడిన రాళ్ళు మూత్ర ప్రవాహాన్ని అడ్డగిస్తాయి లేదా వాష్‌బేసిన్‌లో "గంద్ర" ఇసుకపోస్తే ఎలా ఉంటుందో అదే రీతిన మూత్రకోశం తయారవుతుంది. ఈ ఇసకలాంటి పదార్థం ఒక్కోసారి మూత్రకోశం అంచులకు ఒరిపిడి కలుగజేస్తుంది.

మనం సేవించిన ఆహారంలో జీర్ణంకాగా మిగిలిన వ్యర్థపదార్థాలు గడ్డకట్టి రాళ్ళరూపంలో మూత్రకోశంలో చేరతాయి. సాధారణంగా ఈ రాళ్ళలో కాల్షియం హెచ్చు మోతాదులో ఉంటుంది. ఈ రాళ్ళ పరిమాణం మిల్లీ మీటర్ల నుంచి 2 సెంటీమీటర్ల వరకు ఉంటాయి. కొన్ని అతి చిన్నవిగాను, మరికొన్ని అతి పెద్దవిగాను ఉండవచ్చు. ఈ రాళ్ళు స్త్రీలలో కన్నా పురుషులలో మూడురెట్లు అధికంగా ఏర్పడవచ్చు. వయస్సు పైబడిన కొద్దీ అంటే 45ఏళ్ళు దాటినప్పటినుంచి రాళ్ళు ఏర్పడే అవకాశం అధికంకావచ్చు. అదే వయసులో చాలామందికి రాళ్ళు ఏర్పడటాన్ని గుర్తించారు.



మూత్రకోశంలో మూత్రం నిల్వలు పేరుకుపోయినపుడు వ్యర్థపదార్థాలు తొలగింపబడకుండా ఉండి రాళ్ళరూపంలో ఘనీభవిస్తాయి. ప్రొస్టేట్ గ్రంథి పెరిగినపుడు మూత్రకోశం నుంచి మూత్రం పూర్తిగా విడుదలకాదు. అటువంటి సందర్భాలలో వ్యర్థపదార్థాలు గడ్డకట్టి రాళ్ళుగా ఏర్పడతాయి. మూత్ర సంబంధమైన వ్యాధులు తరచు వచ్చే వారికి, తిరగబెట్టేవారికి కూడా మూత్రకోశంలో రాళ్ళు ఏర్పడవచ్చు. గౌట్ వంటి వ్యాధులు సోకిన సందర్భాలలో మూత్రకోశంలో వ్యర్థపదార్థాల మోతాదు పెరిగినపుడు, రాళ్ళు ఏర్పడే అవకాశాలు కూడా హెచ్చవుతాయి.

మూత్రకోశంలో రాళ్ళు ఏర్పడితే ఎటువంటి లక్షణాలు పైకి కనిపించకపోవచ్చు. రాళ్ళ పరిమాణం చిన్నదిగా ఉన్నపుడు, మూత్ర విసర్జన ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరగవచ్చు. రాళ్ళ పరిమాణం పెరిగినపుడే మూత్రవిసర్జన కష్టమై, రక రకాల లక్షణాలు వ్యక్తమవుతాయి.

మూత్రకోశం అంచు పొరలు ఒరిపిడికి గురై ఇతర అంటువ్యాధులు సోకవచ్చు.

ఈ రాళ్ళను కరిగించడం ఎలా ?

రోగి లక్షణాలను బట్టి మూత్ర కోశంలో రాళ్ళు ఉన్నదీ లేనిదీ తెలుసుకొనేందుకు వివిధ రకాల పరీక్షలు అవసరం. మూత్రపరీక్ష, రక్తపరీక్ష, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్ వంటి పరీక్షలు చేయించాలి. ఇవిగాక ఇంట్రావీనస్

మూత్రకోశంలో రాళ్ళు ఎందుకు ఏర్పడతాయి

- ★ పురుషులలో వయసు పైబడుతున్న దశలో
- ★ ద్రవ పదార్థాల సేవన బాగా తగ్గినపుడు
- ★ మూత్రకోసం పూర్తిగా ఖాళీకానపుడు, అసంపూర్తిగా మూత్ర విసర్జన
- ★ మూత్ర సంబంధ వ్యాధులు తరచూ తిరగబెట్టినపుడు
- ★ శరీరంలో యూరిక్ ఆమ్లం మోతాదు తగ్గినపుడు వచ్చే గౌట్ వ్యాధి సోకినపుడు పేరుకుపోవడం



మూత్రకోశంలో రాళ్ళు -లక్షణాలు

★ మూత్రంలో రక్తం పోవచ్చు.

★ మూత్రవిసర్జన సమయంలో బాధ కలుగవచ్చు.

★ అత్యవసరంగా మూత్రం విసర్జించాల్సిరావచ్చు.

★ తరచూ మూత్రవిసర్జన చేయవలసిరావచ్చు.

★ మూత్రకోశం ఒరిపిడికి గురైనపుడు మూత్రవిసర్జన ఆపుకొనే స్థితిని రాళ్ళు కలుగచేస్తాయి. మూత్రం నిల్వలు అధికమై బాధకలుగుతుంది.



యూరోగ్రఫీ (ఐవియు) అనే ప్రత్యేక తరహా పరీక్ష చేస్తారు. మూత్రాశయం (కిడ్నీ) మూత్రనాళం, మూత్రకోశం చిత్రాలను ఈ పరీక్ష ద్వారా చిత్రీకరించి రాళ్ళు ఉన్నదీ, లేనిదీ, ఉంటే ఎక్కడ ఏ పరిమాణంలో ఉన్నదీ తెలుసుకుంటారు.

ఒకోసారి మూత్రకోశం అంతర్భాగాన్ని పరిశీలించేందుకు సిస్టోస్కోపి అనే పరీక్ష నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో సిస్టోస్కోప్ అనే ఫైబర్ ఆప్టిక్ కెమేరాను మూత్రమార్గం ద్వారా మూత్రకోశంలోకి పంపుతారు. ఒకవేళ మూత్రకోశంలో రాళ్ళు ఉంటే ఈ ప్రక్రియతో వాటిని కరిగించి బయటకు తోసేస్తారు.

ఈ రాళ్ళను తునకలు తునకలుగా చేసి మూత్రం ద్వారా పోయేట్లు చేస్తారు. ఇందుకు లితోట్రిప్స్ అనే అల్ట్రాసౌండ్ ప్రక్రియ అమలు చేస్తారు. ఈ ప్రక్రియల ద్వారా తొలగించడానికి వీలులేని పరిమాణంలో రాళ్ళు ఉండి ఉంటే అపుడు శస్త్రచికిత్స ద్వారా వాటిని తొలగిస్తారు.

మూత్రకోశంలో పదే పదే రాళ్ళు ఏర్పడతాయి కాబట్టి అవి కనీస స్థాయికి మించి ఏర్పడకుండా పరిమాణాన్ని తగ్గించగలగాలి. అందుకు రోగి ప్రతిరోజూ హెచ్చు మోతాదులో నీరు వంటి ద్రవాలు సేవించాలి. అంతేకాక గౌట్ వంటి వ్యాధులు సోకకుండా జాగ్రత్తపడాలి. ◆

డాక్టర్ సలహాలు

☛ చెవినొప్పి వచ్చినపుడు చెవిలో నూనె, ఆముదము, స్పిరిట్, హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటివి వేయరాదు. అగ్గిపుల్ల, పిన్నీసు, పక్షుల ఈకలతో తిప్పరాదు.

☛ చెవి నుండి చీము కారునప్పుడు చెవిలో నూనె, ఆముదము వేయరాదు. చెవిలోనికి నీళ్ళు పోయరాదు. ఈత (స్విమ్మింగ్) చేయరాదు.

☛ చెవిలోనికి ఏమైనా పురుగుపోతే నీళ్ళు పోసి కొంచెం సేపు చెవి మూసి ఉంచితే అది చనిపోవును. తరువాత దానిని చెవి వైద్యునిచే తీయించుకోవలెను.

☛ పిల్లలు చెవిలో ఏదైనా వస్తువు పెట్టుకొనినప్పుడు దానిని తీయుటకు ప్రయత్నించినచో కర్ణభేరి పగిలిపోవును. దానిని చెవి వైద్యునిచే తీయించుకొనవలెను.

☛ 6 నెలలు నిండిన పిల్లలు శబ్దము వచ్చిన వైపుకు చూడకపోతే పుట్టుకతో చెముడు లక్షణంగా భావించి చెవి వైద్యుని సంప్రదించవలెను.

– డాక్టర్ శింగరి ప్రభాకర్,
చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నిపుణులు.

ఆరోగ్య సలహాల కోసం ప్రశ్నలు పంపండి

ఆదివారం అనుబంధంలో పాఠకుల నుంచి ఆరోగ్య సమస్యలపై ప్రశ్నలు ఆహ్వానిస్తున్నాం. మీ సమస్యలకు నిపుణులైన వైద్యులు పరిష్కారాలు సూచిస్తారు. ప్రశ్నలు సూటిగా, సాధ్యమైనంత కుప్లంగా ఉండాలి.

<u>ప్రశ్నలు పంపవలసిన చిరునామా :</u>

సంపాదకులు, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్ – 20

బేరం!

* అంపశయ్య నవీన్

"వంకాయలు, బీరకాయలు, దొండకాయలు, దోసకాయలు, చిక్కుడు కాయలు, పచ్చి మిరపకాయలు" అని పెద్దగా అరుచుకుంటూ వెళ్తోంది మా ఇంటి ముందు నుంచి కూరగాయలమ్ముకొని బతికే ఓ మధ్య వయస్కురాలు.

"ఆ కూరగాయలామెను పిలవండి" అని కేకపెడ్తూ ఇంట్లోంచి బయటికొచ్చింది మా ఆవిడ.

ఉదయమే ఇంటి ముందు కూర్చొని పేపర్ చదువుకుంటున్న నేను "ఓ కూరగాయలామె" అంటూ కేకేసి ఆ కూరగాలమ్మే స్త్రీని ఆపాను.

ఆమె గేటు తెరుచుకొని మా ఇంటి ఆవరణలో ప్రవేశించింది. ఆమె నెత్తి మీద రకరకాల కూరగాయలతో నిండిన ఓ పెద్ద గంప ఉంది.



"అయ్యా! జర్ర గీ గంపదించడానికో చెయ్యేస్తరా?" అందామె నాకేసి బతిమాలుతున్నట్టుగా చూస్తూ.

"అయనేం చెయ్యేస్తడులే. నేనే దింపుత పట్టు" అంటూ మా ఆవిడ ఆమె నెత్తి మీది కూరగాయల గంపను కిందికి దించడానికి తన చెయ్యి అందించింది.

"ఈ బీరకాయలు ఎట్లిస్తవు" అంది మా ఆవిడ.

"నాల్గు రూపాయలకు పావు కిలో" అంది కూరగాయలామె.

"పావు కిలో నాలుగు రూపాయలా? చాలా ఎక్కువ చెప్పినవు. మొన్న మీరు రైతు బజారుకు బోయి కూరగాయలు తెచ్చింద్రు గదా.. అప్పుడు పావు కిలో బీరకాయలెట్లిచ్చింద్రు?" అంది మా ఆవిడ.

"కిలో ఎనిమిది రూపాయలకు ఇచ్చినట్లు గుర్తుంది." అన్నాన్నేను.

"కిలో ఎనిమిది రూపాయలంటే పావుకిలో రెండ్రూపాయలే. నువ్వు నాలుగు రూపాయలంటున్నవు. ఎంత అన్యాయం! ఎంత అన్యాయం!" అంది మా ఆవిడ.

"దీంట్ల అన్యాయం యేం లేదమ్మా! మాది మారు బేరం. ఒక దగ్గర దెచ్చి మీకమ్ముతం.. మాకు దీంట్ల ఓ యాభై పైసలు కూడ మిగలయి" అంది కూరగాయలామె.

"అదంతేం లేదు. రెండున్నరకు పావు కిలో చొప్పున ఇస్తే ఇవ్వు. లేకపోతే పో" అంది మా ఆవిడ.

"గట్లంటెట్ల బాంచెను. మేమెట్ల బతకాలె.. మూడు రూపాయలెంబడి తీసుకోండ్రి" అంటూనే ఆమె త్రాసు తీసి బీరకాయలు జోకడం మొదలెట్టింది.

కొంచెం ఆగు. బీరకాయలు లేతయిజూసి పెట్టు.. ఈ కాలంల వచ్చే బీరకాయలు చేదు కూడుంటయి. చేదు చూసినంక జోకాలె..." అంది మా ఆవిడ.

జోకేటప్పుడు కూడా "నువ్వు మంచిగ జోకుతలేవు. దండికొడ్తున్నవు" అంది మా ఆవిడ.

"అట్లయితే మీరే జోక్కోండ్రి" అంటూ కూరగాయలామె త్రాసును మా ఆవిడ చేతికిచ్చింది.

"నాకేం జోకొస్తదిలే.. నువ్వేమంచిగ జోకు" అంది మా ఆవిడ.

అరకిలో బీరకాయలు తీసుకోవడం అయిపోయాక బెండకాయలు, దొండకాయలు, దోసకాయలు, పచ్చి మిరపకాయలు, కొత్తిమీర, మెంతి కూర - ఇవి కూడా మా ఆవిడ తీసుకున్నది. ప్రతి దాని విషయంలోనూ కూరగాయలామెతో బేరమాడింది. ఆమె చెప్పిందానికి ఓ రూపాయో, అర్ధ రూపాయో తగ్గించాకే వాటిని తీసుకుంది. మొత్తం లెక్క చూసి కూరగాయలామెకిచ్చేశాక ఆమె వెళ్ళిపోయింది.

కూరగాయల విషయంలో నువ్వెందుకింత బేరం చేస్తావు. ఆ కూరగాయలమ్మే ఆమెను చూస్తే తెలియడం లేదా? ఆమె పేద మనిషని. పావలానో, అర్ధ రూపాయో తగ్గించమని ఎందుకంతగా ప్రాకులాడటం.. నువ్వో పెద్ద షాపుకు వెళ్ళినప్పుడు ఇలాగే పావలా తగ్గించమనో, అర్ధ తగ్గించమనో బేరం చేస్తావా? పెద్ద షాపుల వాళ్ళు లక్షాధికారులు. షాపును చూడగానే మన కళ్ళు జిగేలుమనేలా అలంకరణ ఉంటుంది. అక్కడికొచ్చే కష్టమర్లు కూడా చాలా హైక్లాసువాళ్ళే ఉంటారు. వాళ్ళ ముందు బేరమాడితే వాళ్ళు మనల్ని సంస్కారం లేని వాళ్ళనో, పల్లెటూరి వాళ్ళనో అనుకుంటారని బేరమాడటానికి భయపడతాం. వాడు చెప్పినంత ఇచ్చేసి వచ్చేస్తాం. చీరెల మీద, నగల మీద, అలంకరణ వస్తువుల మీద వేలకు వేలు తగలేస్తారు. అక్కడ అసలే బేరమాడరు. అదే ఇంటి ముందుకొచ్చే కూరలమ్ముకొనే వాళ్ళతోనైతే గంటలకు గంటలు బేరమాడతారు.. కూరగాయలమ్మే వాళ్ళే కాదు, చీరెలు, బెడ్‌షీట్లు, బ్లాంకెట్లు అమ్ముకొని బతికే వాళ్ళు కూడా ఇంటి ముందటి కొస్తారు. వాళ్ళతో కూడా ఇంతే.. విసుగులేకుండా ఎన్ని గంటలైనా బేరమాడతారు.. మనం అవతలివాడు బలహీనుడుగా కన్పిస్తే ఒకలాగా, బలవంతుడుగా కనిపిస్తే ఒకలాగా ప్రవర్తిస్తాము.. ఇలాంటి మనస్తత్వం చూస్తే నాకు చాలా ఆశ్చర్యం కల్గుతుంది. మనం అందరి విషయంలోనూ ఒకేలా ప్రవర్తించాలిగానీ ద్వంద్వ మనస్తత్వం పోవాలి.. ఆ కూరగాయలమ్ముకొని బతికే ఆమెకు ఓ రెండ్రూపాయలిస్తే ఏం? ఎందుకంత సేపు బేరమాడాలి.. నువ్వెక్కువిచ్చిన రెండ్రూపాయల్తో ఆమె కోటీశ్వరురాలు అయిపోవడం లేదు కదా.. రెండ్రూపాయలెక్కువివ్వడం వల్ల ఆమె పేదరికం ఏ కొంచెం తగ్గినా మనం సమాజానికి కొంచెం సేవ చేసినట్టే కదా... మనం ఆర్థికంగా కాస్త ఉన్నవాళ్ళం కాబట్టి మన కంటె తక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళకు ఈ మాత్రం సహాయం చెయ్యొచ్చుకదా.. దయచేసి నువ్విప్పట్నించి కూరగాయలమ్మే వాళ్లతో బేరమాడటం మానేసెయ్యి" అన్నాన్నేను.

"మీ ఉపన్యాసం అయి పోయిందా? ఇంకేమన్నా ఉందా? వాళ్ళు చెప్పడమే చాలా ఎక్కువ చెబుతారు... మనమడిగినందుకు కొంచెం తగ్గిస్తారు. కొంచెం తగ్గించడం వల్ల వాళ్ళకొచ్చిన నష్టమేమీ లేదు.." అంది మా ఆవిడ.

"నువ్వు బేరమాడతావని తెలుసు కాబట్టే వాళ్ళు ఎక్కువ చేసి తక్కువ చేస్తారని తెలుసు కదా.. నువ్వు బేరమాడవని వాళ్ళకు తెలిస్తే ఎక్కువ చెప్పనే చెప్పరు. కూరగాయల విషయం వదిలెయ్... మనం ఇళ్ళలో వాడే అనేక వినియోగ వస్తువుల మార్కెట్లో ఇవ్వాళ్ళ స్లం వచ్చిందంటున్నారు. స్లం అంటే వస్తువులు కొనుక్కోవడానికి మార్కెట్ కొచ్చేవాళ్ళ సంఖ్యతగ్గిపోవడం. అందుకే ఇవ్వాళ్ళ మనలాంటి వినియోగదారుల్ని మార్కెట్‌కు రప్పించడానికి వ్యాపారస్తులు రకరకాల ట్రిక్స్‌ను ఉపయోగిస్తున్నారు.. ఓ షర్టు కొంటే ఓ షర్టు ఉచితం.. ఫలానా రెండు సోప్పు కొంటే మూడో సోప్ ఉచితం. లేకపోతే ఏ వస్తువు కొన్నా ఇంకేదో వస్తువు ఫ్రీ. మొన్న వంటనూనె తెచ్చాను చూడు... ఐదు కిలోలు ఆ నూనె తీసుకుంటే అరకిలో బాస్మతి రైస్ ఫ్రీ అని ఇచ్చాడు. అయితే ఆ ఫ్రీగా ఇవ్వబడే వస్తువు ధరను కూడా కలుపుకునే ఆయా వస్తువుల ధరలు నిర్ణయించ బడతాయి.. మనమీ విషయాన్ని మరచిపోయి ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అనగానే మార్కెట్‌కు పరుగెత్తుతాం.. వేలకు వేలు తగలేసి అవసరమున్నా లేక పోయినా ఒక వస్తువును కొంటే మరో వస్తువు ఫ్రీగా వస్తున్నది గదా అని ఆ వస్తువును కొనేస్తాం. ఫ్రీగా వచ్చిన వస్తువును చూసుకొని మురిసిపోతాం... ఇన్నిన్ని వేలు తగలేసే మనం బజార్లో తిరుగుతూ కూరగాయలమ్ముకొనే పేద వాళ్ళతో మాత్రం పావలా తగ్గించమనో, అర్ధ తగ్గించమనో ఎన్నిగంటలైనా బేరమాడతాం" అన్నాను నేను. ◆

మరణ సంకేతం

భూమండలం ప్రపంచాన్ని మోస్తుంటే
ప్రపంచాన్ని ఉత్తర ధృవ జాలరి
డాలరు గాలమేసి లాగుతున్నాడు.
గాలం చేపలన్నిటినీ కవ్విస్తూ
మరణ సూదికల్ని ఎగరేస్తుంటే
మనం నత్త పాదాలతో నడుస్తూ
అల్పిప్పలమై పోతున్నాము
ప్రాణం చివరి అంచున ఊగిసలాడుతూ
క్షణానికో మరణ సంకేతాన్ని తాకుతున్నయ్
ఇప్పుడు
భూమి ఇరుసు కూడా
డాలరు గడియారం ప్రకారమే నడుస్తున్నది.
ఇక మన జీవితాలన్నీ
డాలరు చేతి గీతల్లోనే దాగుంటాయి.
మన సూర్యోదయాలన్నీ
వాని నీలి నీడల చుట్టే తిరుగుతుంటాయి
ఇక్కడి
కలంకారి, ఖాదీ శాలి
నూలుపోగుల ఆకస్మిక చావులకు పారితోషికం
అక్కడి 'ఈ-మెయిల్' లో ప్యాకింగు వస్తుంది.
రుచి మరిగిన నాలుక కుండల్నే కాదు
విస్తర్లనూ చిదిమెయ్యక మానదు
నిన్న మెసపుటోమియా చిత్రాలు
బాబిలోనియా బొమ్మరిల్లూ
కాలికింద చీమలైపోయినా
మన మస్తిష్కాలు మత్తు పొరల్లో
గురకలేస్తూనే ఉన్నాయి.
ఇకనైనా
ఒక్క అశృకణమైనా
రాల్చకపోతే
రేపు తుడవడానికి
ఏ చేతులూ విస్తరించవు.
దుఃఖాన్ని పంచుకోవడానికి
ఏ కళ్ళూ సిద్ధంకావు

- డాక్టర్ ఉదారి నారాయణ

బతుకు 'యుద్ధం'లో బాధల పాట

పాలొదలని పసికందుల్ని
తెల్ల డేగలు తరుముతున్న వేళ ఇది!
పెట్టుబడులు సుడిగుండాలై...
మట్టి కాళ్ళను చుట్టుకున్న నేల ఇది!
పంతులుగారూ? పంచాంగంలో ఎలాగున్నా
ఇక్కడ కోకిలమ్మ కూతల్లేవు!
మావిడాకు పూతల్లేవు!

శవాల గుట్టల మీద ఆధిపత్యం
జెండాలై ఎగురుతున్న వేళ ఇది!
రుతువుల జూదంలో రైతు
అపర ధర్మరాజై ఓడిన నేల ఇది!

పంతులుగారూ! పంచాంగంలో ఎలాగున్నా
రావణాసురులకే రాజనాలు
రైతులకుండవు భోజనాలు!

వామన పాదమై ప్రపంచాన్ని
కాళ్ళకింద అదుముతున్న వేళ
కరువు మూట నెత్తినెత్తుకొని..
రైతు కన్నీరై సాగుతున్న నేల ఇది!
పంతులుగారూ! పంచాంగంలో ఎలాగున్నా
ఒకడికి చమురు వాసన!
మరొకడికి కమురు వాసన!

పంచాంగమో! రాజ్యాంగమో! ఏదైతేనేం?
ఏది ఏమి చెప్పినా మాక్కావలసింది
పిడికెడు మెతుకులు బుక్కెడు గెంజి!
వలస పోకుండా బతుకు యుద్ధంలో నిలబడ్డానికి
కాళ్ళకింద ఇంత నేల!

- చింతా అప్పలనాయుడు

"కన్నా ఈ డ్రెస్ చూడమ్మా చాలా బావుంది. తీసుకుందామా?" అని పదేళ్ళ కళ్యాణ్‌ను అడిగింది వాళ్ళ అమ్మ.

"ప్చ్.. నాకేమీ నచ్చలేదు. అదిగో అక్కడ ఉంది చూడు. అది బావుంది మమ్మీ. దాన్ని తీసుకుందాం" అన్నాడు కళ్యాణ్.

"ఆ రంగులు ఏమీ బాగోలేదమ్మా. అది వద్దు. ఈ డ్రెస్ చాలా మంచిది. దీన్ని తీసుకుందాంలే అని వాళ్ళ అమ్మ అనడంతో 'నాకేమీ వద్దులే, నాకేమీ నచ్చలేదు. నేనేమీ తీసుకోను" అని అలిగాడు.

దీనితో వాళ్ళమ్మ విసుక్కుంటూ అందుకే పిల్లల్ని షాపింగ్‌కు తీసుకురాకూడదు. తీసుకు వచ్చిన దగ్గర నుండి అవి కాదు ఇవి. ఇవి కాదు అవి అంటూ పెద్దవాళ్ళు తీసిచ్చినవి గాక వాళ్ళిష్టమొచ్చినవి కావాలంటారు. ఇలా అయితే ఎలా అని కసురుకోవడంతో షాపింగ్ అయిపోయేవరకూ కళ్యాణ్ ఏమీ మాట్లాడకుండా మౌనంగానే ఉన్నాడు.

ఇది కేవలం కళ్యాణ్ ఇంట్లో విషయమే కాదు. దాదాపు ప్రతి ఇంట్లో సాధారణంగా జరిగేదే.

పిల్లలకూ సొంత అభిప్రాయాలుంటాయి

* వి. ఆర్. వాగోలు

"మమ్మీ, నేను ఆ స్కూలులో చేరతాను. మా ఫ్రెండ్స్ అంతా ఆ స్కూలులోనే చేరారు. నన్ను కూడా అక్కడే చేర్పించరూ" అని అడిగిన వివేక్‌తో "నిన్ను వేరే స్కూలులో చేరుస్తున్నాము. అక్కడ చదువు బాగా చెబుతారట. అక్కడ నీకు కొత్త ఫ్రెండ్స్ తయారవుతారు. ఈ స్కూలులో వద్దులే" అనడంతో వివేక్ కాస్తంత నిరుత్సాహానికి గురయ్యాడు.

అప్పుడే పదవ తరగతి పరీక్షా ఫలితాలు వచ్చాయి. కార్తీక్ ఫస్ట్ క్లాసులో పాసయ్యాడు. కార్తీక్‌కు మొదటి నుంచీ డాక్టరు కావాలని కోరిక. అయితే అతని తల్లిదండ్రులకు తమ కొడుకు ఇంజనీరు కావాలని, తద్వారా తమ కలలు సఫలం కావాలని కోరుకునే వారు. దానితో అతనితో కనీసం మాట మాత్రం సంప్రదించకుండా మా అబ్బాయిని ఎం.పి.సి. గ్రూపులో చేరుస్తున్నామని ఇతరులకు చెప్ప సాగారు. కార్తీక్ తనకు డాక్టరు కావాలని ఉందని, తనను బై.పి.సి. గ్రూపులో చేర్పించమని కోరినా 'నిన్ను ఇంజనీరును చేయాలని, అందుకని నువ్వు ఎం.పి.సి.లో చేరాల్సిందేనని' పట్టుబట్టి అందులోనే చేర్పించారు.

ఇటువంటి సంఘటనలు నిత్యం మనం చూస్తుండేవే. తమ పిల్లలు తాము చెప్పినట్లు వినాలని, తాము కోరుకున్న విధంగా ఉండాలనుకోవడం సహజమే. అందులో ఏ తప్పూ కనిపించదు కూడా.

ఇక్కడ ఆలోచించాల్సిన విషయం ఒకటుంది. అదేమిటంటే పిల్లలకు కూడా తమతమ స్థాయిల్లో ప్రత్యేక అభిప్రాయాలుంటాయనేది మరచి పోకూడదు. ఆ అభిప్రాయాలను ఇతరులు గౌరవించాలని, తద్వారా తమ కోరికలు నెరవేర్చుకోవాలని కోరుకుంటారు. ఈ కోరికలు, అభిప్రాయాలకు తల్లిదండ్రులు, పెద్దలు విలువ ఇచ్చినపుడే వాటిని నెరవేర్చుకొనే అవకాశం ఉంటుంది. పెద్దల అభిప్రాయాలను పిల్లలు గౌరవించాలని కోరుకుంటారు. పిల్లలు కూడా తమ అభిప్రాయాలను పెద్దలు గౌరవించాలని కోరుకుంటారు.

అయితే పిల్లల అభిప్రాయాలకు పెద్దలు సరైన విలువనివ్వరు. వాటిని పట్టించుకోరు. దీని వల్ల పిల్లలు తీవ్ర అసంతృప్తికి లోనవుతారు. కొద్దికాలం పాటు వారు అలగడం, అన్నం తినకపోవడం, ఇతరులతో మాట్లాడకుండా ఉండటం వంటి క్రియల ద్వారా తమ అసంతృప్తిని వెల్లడి చేస్తారు. అయినా పెద్దలు తమ మాటలను ఖాతరు చేయకపోతే విధిలేక పెద్దలు చెప్పినట్లు చేస్తారు. దీని వల్ల బాలల్లో నిరాసక్తత, నిర్లిప్తత చోటు చేసుకుంటాయి. తప్పని సరై పెద్దల మాటకు లోబడినా ఇంతకు ముందున్న ఉత్సాహం, ఉత్తేజం, సంతోషం ఉండవు. తద్వారా తల్లిదండ్రులు తమ మాట నెగ్గించుకోవడం వల్ల ఆశించిన ఫలితాలు రాకపోగా బాలలు తమ వైఫల్యాలకు కారణం పెద్దలే అని నిందించే అవకాశం ఉంది.

అటువంటి సమయాలలో పెద్దలు కొన్ని చర్యలు చేపట్టక తప్పదు. చిన్నచిన్న విషయాలలో ముఖ్యంగా పిల్లల అభిరుచుల విషయంలో వారి అభిప్రాయాలకే విలువ ఇవ్వాలి. ఇందుకు పెద్దలు తల దూర్చ కూడదు. తద్వారా బాలల్లో కలిగే ఆనందం వర్ణింపనలవి కాదు. భవిష్యత్‌లో బాలల జీవితంపై ప్రభావం చూపే విషయాలలో సైతం సాధ్యమైనంత వరకు వారి అభిప్రాయాలకే పెద్ద పీట వేయాలి. ఒకవేళ అలా సాధ్యం కాని పక్షంలో చిన్నారులకు ఎందు వలన వారి అభిప్రాయాలను కాదంటున్నామో చక్కగా వివరించి చెప్పి వారు అర్థం చేసుకొనేలా చేయాలి. బలవంతంగా పెద్దల అభిప్రాయాలు పిల్లలపై రుద్ద కూడదు. పిల్లల అభిప్రాయాలు కాదనడానికి కారణం వివరించి తమ అభిప్రాయాల ద్వారా వారికి కలిగే మంచి చెడులను సహేతుకంగా, అర్థమయ్యేలా, విసుక్కోకుండా, నెమ్మదిగా చెప్పాలి.

తద్వారా పిల్లల అభిప్రాయాలను గౌరవిస్తూనే అవసరమైనపుడు వారికి పెద్దల అభిప్రాయాలు గౌరవించి అనుసరించడం ద్వారా కలిగే మేలు గ్రహించేలా చేసి పెద్దల అభిప్రాయంతో ఏకీభవించేలా చేయవచ్చు. ◆

తేనె వైద్యం

విదర్భ రాజ్యాన్ని ఏలే పృథ్వీసింహుడు మంచి పరిపాలకుడు. అయితే రాజ్యపాలనకు సంబంధించి ఇతరుల సలహాలను స్వీకరించడం ఆయనకు నచ్చదు. సలహాలవల్ల తీసుకునే నిర్ణయాలు ప్రజలను బాధపెడతాయని నమ్మేవాడు. అందువల్ల ఎంతో అవసరమయితే తప్ప ఎవరినీ... చివరికి మంత్రినైనా సంప్రదించేవాడు కాదు.

[illegible] పొందుతున్న ఆయనకు ప్రమాదవశాత్తు కత్తి తాలి చేతికి తీవ్రంగా గాయమైంది. ఆస్థాన వైద్యుడు గోవర్ధనాచారిని పిలుచుకొచ్చాడు మంత్రి జ్ఞానజిత్తు. ఆచారి మంచి వైద్యుడేకాక... సామాజిక విషయాలు, రాజ్య సంక్షేమం పట్ల శ్రద్ధ ఉన్న వ్యక్తి. పృథ్వీసింహుని మిత్రుడు కూడా. ఆయన రాగానే రాజుగారి గాయాన్ని పరిశీలించి కొన్ని లేపనాలు పూసి కట్టుకట్టాడు.

'ఆచారిగారూ... ఈ గాయం నయమవ్వడానికి ఎన్ని దినాలు పడుతుంది? రాజ్యపాలన సజావుగా సాగించేందుకు ఇది ఎంతో అడ్డంకిగా వుంది' అడిగాడు మహారాజు.

'ప్రభూ... మీకు విశ్రాంతి అవసరం. నా దగ్గరి మందులతో అయితే నయమయ్యేందుకు ఓ పది దినాలు పడుతుంది. కానీ...' అంటూ సందేహించాడు గోవర్ధనాచారి.

'చెప్పండి... ఇతర దేశాలనుంచి ఖరీదైన మందులు తెప్పించడానికైనా నేను సిద్ధం. గాయం త్వరగా మానితే చాలు. ఎక్కువ కాలం ఇలా విశ్రాంతి తీసుకోవడం వల్ల నాలో బద్ధకం కూడా రావచ్చు' నవ్వుతూ అన్నాడు రాజు.

'ఖరీదైన మందులేం అక్కర్లేదు మహారాజా... నా మందుల్ని తేనెతో కలిపి తీసుకుంటే త్వరగా నయమవుతుంది' ఆచారి వినయంగా చెప్పాడు.

అతని మాటలు రాజుకు వింతగా తోచాయి. ఆయన ఆశ్చర్యపోతూనే 'మీ మాటలు నాకు ఎంతో కొత్తగా అనిపిస్తున్నాయి. తేనె కోసం ఎందుకలా సంశయిస్తున్నారు? నేను వెంటనే తెప్పిస్తాను. మీ వైద్యాన్ని కొనసాగించండి' ఆజ్ఞాపించాడు పృథ్వీసింహుడు.

మంత్రి జ్ఞానజిత్తును పిలిచి ఓ జాడీ తేనెను వెంటనే తీసుకురావలసిందిగా పురమాయించాడు. తేనె కోసం వెళ్ళి మూడు రోజుల తర్వాత తిరిగొచ్చాడు జ్ఞానజిత్తు. ఈ మూడు దినాలు తేనె లేకుండానే వైద్యం చేశాడు గోవర్ధనాచారి. ఒట్టి చేతులతో వచ్చిన జ్ఞానజిత్తుని చూచి 'ఏమిటి జ్ఞానజిత్తూ! ఏమయింది నీకు? ఒక జాడీ తేనె తీసుకురాలేకపోయావా... ఇది నీ మంత్రిపదవికే అవమానం. తక్షణం రాజీనామా సమర్పించు...' పట్టరాని కోపంతో అన్నాడు పృథ్వీసింహుడు.

జ్ఞానజిత్తు బెదరకుండానే 'మహారాజా నా చేతకానితనం రుజువయితే నన్ను ఉరితీయండి. ఈ మూడు దినాలూ ఎన్ని వ్యయప్రయాసలకోర్చినా... ఫలితం లేదు. స్వయంగా మీరు విచారణ జరిపి నిజానిజాలు గ్రహించగలరు' వినయంగా చెప్పాడు.

పృథ్వీసింహుడు శాంతించి యదార్థాన్ని పరిశీలించేందుకు రాజ్యపర్యటన చేశాడు. నిజంగానే ఎక్కడా తేనె లభించలేదు! తేనె కొరతకు గల మూలకారణాన్ని రెండు మూడు రోజుల్లో తెలుపవలసిందిగా అధికారులను ఆదేశించి రాజధానికి తిరిగి వెళ్లాడు.

రెండు రోజుల అనంతరం సభకు వచ్చిన అధికారులు రాజుముందు వినయంగా నిలబడి 'ప్రభూ... తేనె లభించకపోవడానికిగల ముఖ్యకారణం... తేనె నందించే వివిధ పుష్పజాతులు నశించడమే! వేటకి అడ్డుగా ఉన్నాయన్న సాకుతో మన భటులు అడవిలోని పూలచెట్లను, లతలను పెరికివేశారు. ప్రజలుకూడా వ్యాపార కాంక్షతో టేకు, గంధం లాంటి చెట్లను తమ ఇళ్ల ఆవరణల్లో పెంచుతున్నారేగాని పూలచెట్లపై ప్రేమ చూపడంలేదు. ఈ ప్రక్రియ కొన్ని సంవత్సరాలుగా జరుగుతోంది. చివరికీ దుస్థితి ఏర్పడింది. పూలు, తేనెటీగలు, తేనె... ఇలా ఒకదాని తర్వాత ఒకటి అంతరించిపోయాయి...' అని చెప్పారు.

ఆ మాటలను శ్రద్ధగా విన్న రాజు... తక్షణమే వివిధ పుష్పజాతి మొక్కలను పెంచవలసిందిగా ప్రజలను ఆదేశించాడు. పరోక్షంగా రాజుకు సలహానిచ్చి, ఒక అపురూప ప్రకృతి సంపద నాశనం కాకుండా కాపాడుకున్నందుకు గోవర్ధనాచారి, జ్ఞానజిత్తు పరస్పరం అభినందించుకున్నారు.

శాఖమూరి శ్రీనివాస్



క్విజ్-62

1. దక్షిణ ఆఫ్రికాలో వజ్రములకు ప్రసిద్ధి?
   ఎ.కింబర్లీ బి. రొడీషియా
2. 'నేతాజీ' అని పిలుచుకునే వ్యక్తి?
   ఎ.సర్దార్ పటేల్ బి. సుభాస్ చంద్రబోస్
3. 'అంకుల్‌శామ్' అని ఎవరిని పిలుస్తాము?
   ఎ. చైనా పౌరుడు బి. అమెరికా పౌరుడు
4. 'ఇలియడ్' రచయిత?
   ఎ.షేక్‌స్పియర్ బి.హోమర్
5. ఫారన్‌హీట్‌లో మానవుని ఉష్ణోగ్రత?
   ఎ. 90 డిగ్రీలు బి. 98.4 డిగ్రీలు
6. మనదేశములో ప్రజల ముఖ్య వృత్తి?
   ఎ.చేతి పనులు బి. వ్యవసాయము
7. ప్రపంచ పైకప్పు అని దేనిని పిలుస్తాము?
   ఎ. టిబెట్టు బి.కాశ్మీరు
8. ఒక తరగతి ఎగువహద్దుకు, దిగువ హద్దుకు మధ్యగల భేదమును ఏమని పిలుస్తారు?
   ఎ.వ్యాప్తి బి. తరగతి అంతరము
9. మహాసముద్రములలోకెల్ల చిన్నది?
   ఎ.పసిఫిక్
   బి.అంటార్కిటిక్
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ.మోటూరు హనుమంతరావు
   బి.నండూరి ప్రసాదరావు

చిన్నారి చిత్రకారులు

గడియారం అనూష,
5వ తరగతి,
ఎయుపి పాఠశాల, ఇచ్ఛాపురం.

ఎస్.జయకాంత్, 6వతరగతి,
ఎన్ఎమ్ఆర్‌విసిహెచ్‌స్కూల్,
చల్లపల్లి.



ఎ.శివ, 7వతరగతి,
విశాలభారతి విద్యాలయం,
జగిత్యాల.

పి.గణేష్, ధర్మన్నగూడ,
మాచారం, రంగారెడ్డి.

సీసాలో గుడ్డు

హల్లో... నేస్తాలూ... బాగున్నారా?

నేను ఒక చిన్న పని చెప్తాను. చేస్తారా? బాగా ఉడకపెట్టిన గుడ్డు తీసుకోండి. దాని పెంకు కూడా వలిచేయండి. ఆ... ఇప్పుడు దీన్ని పాలసీసా లోపలికి పంపించాలి. చెయ్యగలరా? ఏంటి! అలా గుడ్లు తేలేస్తున్నారు!! మీవల్లకాదా? అరే... అంత చిన్ని తమాషా కూడా చేయలేరా! ముందు ప్రయత్నించండి. ఉడకపెట్టిన గుడ్డును సీసా లోపలికి పంపండి. పోవట్లేదా?

సరే. నేనే చెప్తాలే. సీసాలోపలకూడా గాలి వుంటుంది. ఆ విషయం మీకు తెలుసుగా. ఆ గాలి, గుడ్డును లోపలికి పోనివ్వదు. అందుకని ఒక అగ్గిపుల్ల వెలిగించి సీసాలోపల వేయండి. వెంటనే కోడిగుడ్డును సీసామూతిపైన పెట్టండి. సీసా లోపల మండుతున్న అగ్గిపుల్ల ఆక్సిజన్‌ను హరిస్తుంది. అప్పుడు బయటవుండే గాలి ఒత్తిడి గుడ్డును సీసాలోకి నెడుతుంది.

ఇప్పుడు ఆ గుడ్డును మళ్లీ బయటకు తీయాలి. తియ్యండి. రావట్లేదా. ఎన్నిసార్లు ప్రయత్నించినా రావట్లేదా! అలా అయితే సీసాను తిరగవేసి పట్టుకోండి. అప్పుడు గుడ్డు మూతి దగ్గరకు వస్తుంది. వచ్చిందా...! ఇప్పుడు పై ఫొటోచూడండి. అందులోవున్న అబ్బాయిలాగా పాలసీసాను మీ నోటి దగ్గర పెట్టుకుని గట్టిగా గాలి ఊదండి. అంతే. గుడ్డు టపామని కిందపడిపోతుంది. పడిందా! మరి గబాల్న పట్టుకున్నారా? ఇదీ! గుడ్డును సీసాలోపలికి, లోపలినుంచి బయటకి రప్పించే మేజిక్.

ముక్కలు అతికిస్తే....!

పక్కన ఒక బొమ్మ వుందే.... అది ఏంటనుకున్నారు? కంగారు బొమ్మ. ఆ పక్కనే వున్న ముక్కలను అతికిస్తే ఆ కంగారు బొమ్మ తయారవుతుంది. ఏ మాత్రం కంగారు పడకుండా మూడంటే మూడే నిముషాలలో అతికించాలి.రడీనా..!



కలంస్నేహం

పేరు: కుంజా సతీష్‌కుమార్,
వయసు : 15 సం॥
చదువు :10 వతరగతి
హాబీలు : చెస్, క్యారమ్స్, క్రికెట్ ఆడడం, కథలు రాయడం, చదవడం, స్టాంపులు, పాత నాణాలు సేకరించడం.
పూర్తి చిరునామా : కె.సంతోష్‌కుమార్, సన్నాఫ్ కె.ధర్మారావ్, ఇం.నెం: 19-1-62, భగవాన్‌దాస్ కాలనీ, భద్రాచలం, ఖమ్మం.

పేరు:జి.వాహిని,
వయసు :12 సం॥
చదువు :8 వతరగతి
హాబీలు:చెస్, షెటిల్, క్యారమ్స్ ఆడడం.
పూర్తి చిరునామా :జి.వాహిని, అనూస్ అకాడమీ, కెడిఆర్. నగర్, వనపర్తి, మహబూబ్‌నగర్-509103.

పేరు:పెద్ది లవకుమార్,
వయసు :10 సం॥
చదువు :6 వతరగతి
హాబీలు:క్రికెట్ ఆడడం, పేపరు చదవడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా :పి.లవకుమార్, నంగునూర్, ఇం.నెం: 7-23, నంగునూర్, మెదక్-502280.

ఫ్రెండ్స్...మీకుకూడా కలంస్నేహం చేయాలని వుందికదూ. మరి ఆలస్యం చేయకుండా పోస్టుకార్డు తీసుకుని మీ హాబీలు, అడ్రస్ రాసి, ఫొటో అంటించి మాకు పంపండి.

క్విజ్ 61 జవాబులు

1.చికాగో 2. కుటుంబము 3. చరకుడు 4. సునీల్ గవాస్కర్ 5. హమ్మింగ్ 6. ఒకటి 7. జోహాన్స్‌బర్గ్ 8. ఆలివ్ 9. ఇటలీ 10. ఎఆర్.రెహమాన్

క్విజ్ 60కి సరైన సమాధానాలు రాసిన వారు :

కె.వెంకటేశ్వర్లు, 7వ తరగతి, **బి.పాపారావు**, 9వ తరగతి, **ఎం.వినయ**, 9వ తరగతి, జెడ్‌పిహెచ్‌స్కూల్, ప్రకాశం. **పెండ్యాల కృష్ణప్రసాద్**, 8వ తరగతి, **డి.అనురాధ**, 6వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **సి.నరసింహారావు**, 10వ తరగతి, గవరపాలెం, విశాఖ. **ఎస్.జమునారాణి**, 10వ తరగతి, లక్ష్మినగర్, మెదక్. **ఎక్స్.రాజు**,9వ తరగతి, బాపట్ల.

ఈ పతాకం ఎవరిది?



ఎరుపు అంచు, ఆకుపచ్చ మధ్యలో నెలవంక. ఇది ఏ దేశపు పతాకం?

(జవాబు: మాల్దీవులు — printed inverted: ˈ౹ɐɾɐ: ɐ̃ɐɐ)

యువరాజుల తెలివి

అనగనగా ఒక ఊళ్లో ఓ రాజు ఉండేవాడు. ఆ రాజు పేరు భార్గుడు. ఆ రాజుకు ఇద్దరు కుమారులు. ఒక రోజు రాజు తన ఇద్దరు పిల్లలకు చెరో వంద బంగారు నాణాలు ఇచ్చి సొంతంగా బతకమంటాడు. అప్పుడు వారు అడవికి వెళతారు. అడవిలో నడుస్తుండగా ఓ చిన్న గుడిసె కనపడుతుంది. ఆ గుడిసె లోపల ఒక ముసలమ్మ నివసిస్తుంటుంది. ఆమెది దుష్ట స్వభావం. ఆ ఇద్దరు యువరాజులు లోపలకు వెళతారు. అప్పుడు ఆ ముసలమ్మ వారిని చూసి 'ఎవరు బాబూ మీరు? ఎక్కడినుంచి వచ్చారు?'అని అడుగుతుంది. అప్పుడు యువరాజులు 'మేము భార్గుడు రాజు కుమారులం. మా నాన్నగారు మాకు చెరి వంద బంగారు నాణాలు ఇచ్చి మా సొంతగా బతకమన్నారు. అందుకని అడవికి వచ్చాము' అని చెప్పారు. 'సరే మీరు ఇక్కడే ఉండండి. మంచి తిండి పెడతాను. కాని మీరు నాకు ఒక పని చేసిపెట్టాలి' అన్నది ముసలమ్మ. 'సరే' అన్నారు యువరాజులు. ముసలమ్మ వాళ్లకి బాగా తిండి పెట్టి పొద్దున్నే లేపి 'నేను ఒక గుంట చూపిస్తాను. ఆ గుంటలోకి దూకి మీ ఇద్దరిలో ఎవరు ముందు వస్తే వాళ్ళు చాలా మంచి వాళ్ళు' అని చెబుతుంది. అప్పుడు యువరాజులు 'మేము వెళ్లం. ఆ గుంట చాలా లోతుగా వుంది' అంటారు. ముసలమ్మ, యువరాజులు ఈ విషయమై వాదులాడుకుంటుండగా భార్గవరాజు కుమారులను వెతుక్కుంటూ వస్తాడు. వాళ్లు ఆయనను చూడగానే జరిగినదంతా చెబుతారు. యువరాజులను మోసంతో చంపాలని ప్రయత్నించినందుకుగాను ఆ ముసలమ్మకు తగిన శిక్ష వేసి రాజ్యానికి వెళ్లిపోతారు. ఆ తర్వాత అందరూ కలసి హాయిగా జీవిస్తారు.

బి.సృజన,6వ తరగతి, గీతాంజలి ఉన్నత పాఠశాల, హైదరాబాదు.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	ల
	రాజు
	క్షణం
	పస్సు
	పాలా
	రుణం

గతవారం జవాబులు

జ	లము
	గము
	పం
	నసము
	టాయువు
	రుగు

✻ రుక్మిణి

ఓం శాంతి.. శాంతి

పహిల్వాన్ పాపయ్యంటే ఆ జిల్లాకే హడల్! కాయం అలాంటిది మరి! కష్టం లేకుండా కుస్తీ పట్లూ... కుందా పోట్లు.. గొర్రె పొటేలు పప్పులతోనే పెరిగిన దేహమాయె! మెడ తిరక్కుండా బలిసిన పాపయ్య సింహనాదంగానీ చేస్తే అల్లులు ఆర్తనాదాలు చేయాల్సిందే! అదుగో అట్లాంటి పాపయ్య.. డొక్క శివాలుగాడు ఆ ఉదయం పూట పెను భయంకరంగా లడాయి వేసుకున్నారు.

ఊరి మధ్య నాలుగు బజార్లు కలిసేచోట.. లడాయి అనలెందుకొచ్చిందో వివరం ఎవడికీ పూరాగా తెలియదుగానీ.. పాపయక చేను నానుకుని ఉన్న శివాలుగాడి పది కుంటల చెక్కను కలిపేసుకుంటానంటే వాడు 'ససేమిరా' వల్ల కాదంటాడు. మొండి.. అదీ..!

ఆ లడాయి మొదలైన అర్ధగంటకే శివాలుగాడి చర్మం ఓడుతున్న శరీరం మీద ఎముక ఎముకకూ పిడిగుద్దులు పడ్డాయి. వాడి నోరైతే పెద్దది.. దానిక్కారణం వాడు దానికి తగినంత 'ఆహారం' అందించలేక పోయాడు. వాడి ఆర్థిక స్థితి అలాంటిది. అయితే వాడి వేలాడే శరీరంలోని నరాలు మాత్రం మహోద్రేకంగా రెచ్చిపోయి కప్పను మింగిన పాము పొట్టల్లా ఉబ్బరిస్తాయి. వాడు పావయ్య కంటే భీకరంగా సింహనాదాలు చేయగలడు. పాపయ్య వంశ చరిత్రనంతా పరమ చండాలమైన బూతు విశేషణాలంకారాలతో - పలికిన బూతు పలక్కుండా ఏకబిగిన పది గంటల్దాకా తిట్ల పురాణం వినిపించగలడు.

చౌరస్తాలో జనం ఎవడి మానాన వాడు పోతున్నాడు. ఓ క్షణం ఆగి ఒక 'ఫీటు' - అంటే మరేంలేదు. పాపయ్య శివాలుగాడ్ని ఎత్తి దూరంగా కాలువలోకి విసరేయాల.. వాడు లేచి స్ప్రింగులా ఉరికి రాంగానే వాడి డొక్కలో పిడి గుద్దులు గుద్దడం.. వాడు హాహాకారాలతో పరమ బూతులు కలిపి, అరిచి పిడికిలి బిగించి తిరిగి లంఘించుట వంటివి.

"అబ్బెబ్బే.. ఏం పోట్లాటయ్యా బాబూ.. ఛ.. ఛ.. శాంతిగా ఉండిచావరు. ఉండనివ్వరూ..!" అని ఓ ఆసామీ విసుక్కుని తన మానాన తాను పోతాడు.

మరో ఫీటులో శివాలుగాడి చెయ్యి మెలవేసి విరుస్తుంటే - వాడేమో పెడబొబ్బలు పెడుతూ లబలబ లాడుతుంటే అటుగా పోయే దానయ్యగారు పళ్ళికిలించి "పోయేకాలం.. ఈలాంటి పోట్లాటలు మా కాలంలో మేం ఎరగం బాబూ.. అబ్బో.. గాంధీగారి వారసులం.. ఛ.. ఛ.. ఊర్లో శాంతి కరువయ్యింది" అని చప్పరించి ఆలస్యమైపోయిందని అంగలేసుకుంటూ ఇంటి దారి పడతాడు.

అప్పటికి మధ్యాహ్నమయింది. మండుటెండ.

శివాలుగాడి ఒంటి మీద చర్మం సగం వరకూ ఊడిపోయింది. ఓ చేతి ఎముక విరిగి బయటకు నెట్టుకు వచ్చింది. నెత్తిమీది బొచ్చంతా పాపయ్య ఎపుడో బరికేశాడు. కాలోటి వేలాడి కుంటేదాకా వచ్చింది. అయినా బూతులు మాత్రం విడువకుండా తూటాల్లా పేలుస్తూ పాపయ్య మీద కలబడి పోతేనే ఉన్నాడు. వాడు తాపులతో.. కుందాపోట్లు పొడుస్తుంటే ఆర్తనాదాలు చేస్తూనే కలబడుతున్నాడు.

చుట్టూ పనీపాటాలేని జనం బడ్డీ అరుగుల మీదా.. గోడలకు జారగిలబడి పరికిస్తున్నారు. దుమ్మురేగి పోతుంది. పిల్లకాయ మొదలు ముసలి పండితుల దాకా 'శాంతి' అవసరం మీద చర్చ సాగిస్తున్నారు.

"పిదప కాలం.. శాంతీలేదు.. ఛ.. ఛ..

"అవునండీ.. ఇపుడు సాయంత్రం కావస్తుంది గదా.. వాళ్ళు 'కలబడ్డం ఆపుతున్నారా.. అసలీ గాడిదలకు శాంతి మహాత్యం తెలియదు."

"అసలిది ఊరా వల్లకాడా.. ఇట్లా కుదరదబ్బాయ్.. శాంతి లేకుంటే ఎట్లా.. ఏదో గుట్టుగా సంసారాలు చేసుకునే వాళ్ళం.. ఈ తగాదాల రొంపిలో బతకలేం.. పొద్దుట్నుండీ ఎటూ తేలకుండా కొట్టుకు చస్తున్నారు. ఏదో ఒక విధంగా శాంతికి వస్తే మంచిది గదా..!" ఓ పంతులుగారు సిగరెట్టు పొగ వదిలి తన ఛీత్కారాన్ని ప్రకటించాడు.

వాళ్ళు మాత్రం 'తగూ' ఆపేటట్లు లేరు. శివాలుగాడి దవడ ఓటి కిందికి వేలాడుతూ రక్తం ఓడుతుంటే - మరింక బూతులను మాత్రం వదల్లేక వాటినే అద్భుతంగా చేతి సంజ్ఞలతోనే వాడు కసిగా పాపయ్య మీద ప్రదర్శిస్తున్నాడు. పాపయ్య మరింత రెచ్చిపోయి వాడి రెండు కాళ్ళందుకుని గిరగిరా గాల్లో తిప్పాడు. వాడు నోట్లోంచి రక్తం దబ్బలు పడుతుండగా హాహాకారాలు చేశాడు. తర్వాత పాపయ్య కసిగా, తాపీగా రొమ్ము నిండా ఊపిరి పీల్చి బిగబట్టి శివాలుగాడి రెండు కాళ్ళనీ పెటేల్మని రెండు వేపులా విరగదీసే సరికి ఒక కాలు తొడతో సహా ఊడి వచ్చింది. పాపయ్య సింహనాదం చేసి తొడలు ఫెళ్ళు ఫెళ్ళున చరిచాడు.

సాయంత్రం కావస్తుంది.

"హమ్మయ్య.. ఇలాగోలాగ 'పోరు' ముగిసింది. పొద్దుట్నుంచీ కొట్టుకు చస్తున్నారు. పాడుముండా కొడుకులు.. ఏదో విధంగా 'శాంతి'కి వస్తే అందరికీ మంచిది గదా.. ఇంటామె గుడ్లు తెమ్మంది.. నాకు ఇక్కడ ఈ బాగోతమే సరిపాయె!" ఓ ఆసామీ సంతృప్తిగా నిట్టూర్చి కదిలాడు.

"ఊళ్ళో అబ్బ.. ఇప్పటిగ్గాని 'శాంతి' వచ్చిందయ్యా.. ఊరికే ఉదయం నుంచి అనవసరపు ' గలాటా' సిగరెటు దూరంగా విసిరేస్తూ పంతులుగారు సంతృప్తిగా కులికాడు.

"అదీ.. అట్లా శాంతిగా ఉంటే ఎదిగే మన పిల్లల భవిష్యత్ అయినా సజావుగా ఉంటుంది.. ఏం లాభం.. ఉదయం నుంచీ అంతే అశాంతేనాయె.. ఛ.. ;ఛ.. !" ఓ ముసిలాడు తృప్తిగా శ్వాస ఎగబీకి విడిచాడు.

'ఓం శాంతి.. శాంతి..!' ◆

*లక్ష్మి

తాయారమ్మ థియరీ..

జాతకాలూ వగైరా గురించి నేను మాటాడదలుచుకోలేదు. వాటి మీద నమ్మకం పెంచుకోమని గానీ, వాటిని పట్టించుకోవద్దని గానీ నేను చెప్పను. అబ్బాయికి అమ్మాయి అమోఘంగా నచ్చుతుంది. అదే స్థాయిలో అమ్మాయికి అబ్బాయి కూడా నచ్చుతాడు. ఇక ముహూర్తాలు పెట్టుకోడమే తరువాయి. ఎవరో జాతకాలు చూడమని సలహా యిస్తారు. ఆ పనికి కొందరు స్పెషలిస్టులుంటారు. వాళ్ళు వధూవరుల జాతకాలు చూచి పెదవి విరుస్తారు. అడక్కపోయినా ఆ పెదవి విరుపుకి తాత్పర్యం వాళ్ళే చెబుతారు. ఆ ఇద్దరికీ పెళ్ళయితే - ఇద్దర్లో ఎవరో ఒకరికి ముక్కు పచ్చడవుతుందని భయపెడతారు. ఫినిష్. పిల్లల ఇష్టాయిష్టాలు గాలికి కొట్టుకుపోతాయి. జరగవలసిన పెళ్ళి ఆగిపోతుంది. ఇది పాతకాలం మాట కానేకాదు. ఇవాళ కూడా ఈ తంతు కొనసాగుతూనే ఉంది! జరగవలసిన పెళ్ళిళ్ళు జాతకాలు కుదరక జరక్కుండా ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు!

జాతకాలు అద్భుతంగా కుదిరేయి గనక - వెనకా ముందు చూడకుండా కళ్యాణం జరిపించమని దైవజ్ఞులు ఇచ్చిన హామీలు ఎన్ని తలకిందులు కావడంలేదూ? అమ్మాయి వల్ల అబ్బాయికీ, అబ్బాయివల్ల అమ్మాయికీ బాగా కలిసి వస్తుందని జాతకాలు చెబుతున్నాయంటారు. దైవజ్ఞులు ఇచ్చిన హామీతో ఆ ఇద్దరికీ పెళ్ళి జరుగుతుంది. పెళ్ళయిన నెల రోజుల్లోనే - విడాకులు పుచ్చుకునేందుకు ఇద్దరూ సిద్ధపడిన సంఘటనలు ఎన్ని లేవు? కలిసి రావడమంటే విడాకులు పుచ్చుకోడమేనా? ఇల్లాంటి ఉదంతాలు విన్న తర్వాత ఒళ్ళు మండిపోదూ? జాతకాలను కొట్టి పారేయండని మీటింగులు పెట్టాలనిపించదూ? చేతిలో ఉన్న గీతల్తో, మొహమ్మీద రేఖల్తో, ఒంటిమీద పుట్టుమచ్చలతో బతుకు ఆధారపడి ఉందని చెబితే నమ్మే వాళ్ళున్నారు! డోంట్‌కేరనే వాళ్ళు కూడా ఉన్నారు! గీతలూ, రేఖలూ, మచ్చల్ని పట్టుక్కూచునే వాళ్ళు బాగు పడరని కూడా చెబుతున్నారు!

ఇదంతా మిడతంభొట్లు ఫార్సుగా తగలడిందని హెచ్చరిస్తున్నాను. చెప్పింది జరిగినప్పుడు - అదంతా జాతక ప్రభావమనే మనిషిని తమ దగ్గరికి తీసుకొస్తే క్లాసు తీసుకుంటామని కళ్ళెర్ర చేస్తున్నారు. చెప్పింది జరక్కపోతే - దానికి పిట్టకథలనేకం వినిపించగల దైవజ్ఞులుంటారని కూడా వారే అంటున్నారు. శుక్రుడి పీకని శనిగాడు పట్టుకోవడం వల్ల లక్కు తిరగబడిందని ఆ దైవజ్ఞులే చెబుతారుట. శనిగాడ్ని డొక్కలో తన్నడమే తక్షణ కర్తవ్యమంటారట. అందుకు ప్రత్యేక పూజలు కొన్ని చేయాలని సలహా ఇస్తారుట. అంతేగాని - కష్టసుఖాలను, లాభనష్టాలను జాతకాలతో ముడివేయడం తప్పు అనే స్టేట్‌మెంటుని వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరుట!

ఎవరెన్ని చెప్పినా - రేపు ఏం జరుగుతుందో ఇవాళే తెలుసుకోవాలనే కుతూహలం బతికున్నంతకాలం - జాతకాలకీ, చిలక జోస్యాలకీ గిరాకీ తగ్గదుగాక తగ్గదు! జాతకాల్ని విడిచిపెట్టండి. మగవాడి జేబు చూచి అతని బాగోగులు ఈజీగా చెప్పవచ్చని మొన్నామధ్య రమాదేవి ఒకానొక పేరంటంలో సవాలు చేసింది. ఇది కూడా ఒక టైపు జోస్యమేనేమో? కాకపోతే - దీనికి జేబు శాస్త్రమని పేరు పెట్టింది! కరెన్సీ నోట్లతో జేబు నిండుగా ఉంటే - సదరు పెద్ద మనిషిని బాగా ఉన్న వాడిగా గుర్తించమంది. జేబు ఖాళీగా ఉన్న మనిషిని 'అయ్యో పాపం' జాతిగా ఎంచుకోమంది. ఈ సిద్ధాంతాన్ని తాయారు అంగీకరించలేదు. అప్పుచేసిన డబ్బుతో జేబు నిండుగా ఉండచ్చు. అప్పులలో మునిగిపోయిన మనిషిని బాగా ఉన్న వాడని ఎట్లా చెబుతావని మందలించింది. డబ్బున్న లోభి మనిషి - చిరుగుల చొక్కాతో తిరుగుతున్నంత మాత్రాన 'అయ్యో పాపం' జాతిలో చేరిపోతాడా అని కోప్పడింది! అక్కడ్తో ఆగిపోలేదు!

ప్రతి నెలా మొదటి వారంలో చాలా మంది జేబులు బరువుగానే ఉంటాయి! అంత మాత్రాన వాళ్ళంతా దొరబాబులని చెబితే చెప్పుచ్చుక్కొడతారు. జీతాలు పుచ్చుకునే సీజను గనక జేబులు అంతో ఇంతో బరువుగానే ఉంటాయి. ఆ జేబులు మూడో వారంలో కూడా చిక్కిపోకుండా ఉంటే అప్పుడు ఆలోచించాలి! వారి వెనుక బండారు కొండైనా అండగా ఉండాలి - లేదూ - జూదశ్రీ బిరుదుతో పేకాట, గుర్రప్పందేల ఆర్టుల్లో రెచ్చిపోతున్న వారైనా కావాలి. అంతేగాని జేబులు బరువుగా ఉన్న ప్రతి మనిషీ జమీందారు కాడు. కాలేదు. అంత మాత్రాన జేబుల్ని పట్టించుకోవద్దని చెప్పడం కూడా సరికాదు. మగమారాజు యొక్క గుణగణాలు తెలుసుకునేందుకు జేబు శాస్త్రం బాగా సహకరిస్తుంది! ఎవరి జేబులో ఏముందో చూడగలిగితే - వారు ఏమిటో, వారి కథేమిటో వారిని అడక్కుండానే తెలుసుకోవచ్చు!

జేబులో ప్లాట్‌ఫారం టిక్కట్టుంటే - ఎవర్నో రైలెక్కించి వచ్చేడనో, స్వాగతం పలికేడనో అర్థం చేసుకోవాలి.. లాటరీ టిక్కట్టుంటే - రాత్రిళ్ళు ఆ పెద్దమనిషి కలత నిద్రకి అసలు కారణం తెలుస్తుంది! బారు బిల్లు జేబులో ఉంటే - రాత్రి శ్రీవారు గుర్రమెక్కేరనీ అర్థమవుతుంది! పిచ్చి అంకెల్తో కాగితమ్ముక్క దొరికితే బ్రాకెట్ ఆడేరని గ్రహించవచ్చు! శ్రీవారి జేబు పుణ్యమాని వారి యొక్క లీలావిలాసాలు వారి అర్ధాంగికి ఎప్పటికప్పుడు తెలుస్తుంటాయి. ఎట్లా తెలుసుకోగలుగుతున్నారని శ్రీవారు అడిగితే - తాళీజ్మహిమ అని చెప్పాలేగాని, వారి జేబు గురించి చెప్ప కూడదు! చెబితే - ఇక ముందు జేబుల్లేని చొక్కాలూ, ఫేంట్లూ కుట్టించుకుంటారు. అంచేత అతను ఎన్ని అబద్ధాలు చెబుతున్నా వినేసి మవునం వహించాలేగాని అతని జేబు గురించి మాటాడ కూడదని - జేబు శాస్త్రంలో డాక్టరేటు పుచ్చుకునే స్థాయి లో చెప్పింది తాయారు! తాయారును మనమంతా అభినందించాలి! ◆

నాటి గొల్లకొండే నేటి గోల్కొండ

* వల్లభనేని సురేష్

అదో అద్భుత చారిత్రక కట్టడం. ఐదు శతాబ్దాల చరిత్రకు నిలువెత్తు నిదర్శనం, అప్పటి కుతుబ్‌షాహి నవాబుల కట్టడ కళానైపుణ్యానికి ప్రతీక. అదే నాటి 'గొల్లకొండ' నేటి గోల్కొండ. ఆంధ్ర రాష్ట్ర రాజధానిలో భాగంగా రాష్ట్ర పర్యాటక కేంద్రాలలో ప్రతి ఒక్కరూ చూడదగ్గ ప్రాంతంగా పరిఢవిల్లుచున్నది. 15 శతాబ్దంలో గోల్కొండను పరిపాలించిన కుతుబ్ షాహి వంశీయులలో సుల్తాన్ కులీకుతుబ్ షా అగ్రగణ్యుడు. ఇతడు 1452వ సంవత్సరంలో పర్షియా (ఇరాన్)లో జన్మించాడు. కుతుబ్ షాహిల *పరిపాలనలో సుమారు 62 సంవత్సరాల* కాలంలో ఈ కోటను కట్టించారు.

గోల్కొండ కోట వివరాలలోకి వెళితే ప్రస్తుతం గోల్కొండ వున్న గుట్ట ప్రదేశం 1143వ సంవత్సరంలో వరంగల్‌ను పరిపాలించిన రాజాప్రతాప్ రుద్రదేవుని పరిపాలన కింద వున్నది. ఇతని కాలంలోనే ఇక్కడ వుండే ఒక గొర్రెలకాపరి ఈ గుట్టపై ఇక ఖిల్లా కడితే బాగుంటుందని చెప్పటంతో రాజాప్రతాప్ దానికి అంగీకారం తెలిపి ఖిల్లా నిర్మించి దానికి గొల్లకొండ అని నామకరణం చేశాడు. అనంతరం నిజాం పాలన కిందకు వచ్చిన తరువాత ఇక్కడ తమ నివాసం కొరకు గొల్లకొండపై ఏర్పాటు చేసుకున్న కోట నేటి గోల్కొండగా రూపాంతరం చెందింది. ఈ కోట నిర్మాణంలో నిజాం నవాబులు శత్రు దాడులను ఎరుర్కోవడానికి అత్యంత చాకచక్యంగా బురుజులు నిర్మించారు. ఈ కోట గోడల నిర్మాణం పెద్ద పెద్ద రాతి బండలతో కట్టబడి చాలా ఎత్తుగా ఉంటుంది. దాదాపు ఐదు మైళ్ళ విస్తీర్ణం తొమ్మిది ప్రధాన ద్వారాలు, శత్రు కదలికలను గుర్తించడానికి 52 కిటికీలు, 48 మార్గములతో నిర్మించబడినది. కోటకు రక్షణగా వున్న గోడకు లోపలి వైపున కందకం ఏర్పాటు చేయబడి వుంది. కోటకు వున్న ద్వారములకు వాటి దిశను బట్టి పేర్లు నిర్ణయించారు. వీటిలో ప్రధాన ద్వారం ఫతే దర్వాజా కోటకు ఉత్తర దిశగా అమర్చబడి వున్నది. ప్రస్తుతం దీని ద్వారానే పర్యాటకులు లోనికి ప్రవేశిస్తారు. దీనికి మధ్య భాగంలో పైన ఒక పెద్ద రంధ్రం వుంది. శత్రువులు కోట తలుపులను ఏనుగులలో నెట్టించు సమయంలో మహిళలు వేడి వేడి నూనెనుకాని, మరిగిన లోహాన్ని కాని పైరంధ్రం ద్వారా వారిపై దొర్లించేవారు. ఈ గేటునుండి ప్రవేశించగానే లోపలివైపున నిర్మించిన పెద్దహాలు వంటి భాగంలో నిలుచుని చప్పట్లు కొడితే ఐదు మైళ్ల విస్తీర్ణం కలిగిన కోట అంతా వినబడుతుంది. ఇది అప్పటి రాజులు కోట రక్షణ కొరకు ఏర్పాటు చేసిన అతి ముఖ్యమైన ప్రక్రియ. దీనిలోనే ఫిరంగి కూడా అమర్చి వుంటుంది. ఇక్కడ నుండి ఖిల్లాపై నున్న దర్బార్ హాల్‌కు వెళ్లటానికి సుమారు 360 మెట్లు ఏర్పాటు చేశారు. గేటుకు లోపలివైపుగా *కుడి పక్క కుతుబ్ షాహీ నవాబుల స్నానాల గది* వుంటుంది. స్నానాల గదిలోకి చల్లని నీరు, వేడి నీరు చెరువునుండి వచ్చేవిధంగా భూమార్గంగుండా పైపులు అమర్చ బడి వున్నాయి. స్నానగదికి పైభాగాన కుడి పక్కగా పెద్దబావి వుంది. దీనిని బడీబావి అని కూడా పిలిచేవాళ్లు. దీనిలో గొలుసు ఆకారంలో వున్న పెద్దరాయి వుంది. దీనిద్వారానే ఎండాకాలంలో కోటపై వున్న జలాశయంనుండి నీరు బావిలోకి పడతాయి. బాలాహిసార్‌కు వెళ్ళే మార్గం కిందుగా ఒక చిన్న నీటి కాలువ ఉంది. దీని ద్వారానే కోటలో వున్న తోటలకు నీరు సరఫరా జరిగేది. దీనిని డ్రగ్ టాంక్ కాలువ అని పిలుస్తారు. బడీ బావికి కుడిపక్క రక్షక భటుల కొరకు నిర్మించిన భవనం కలదు దీనిలోనే అప్పటి కుతుబ్ షాహిల పాలనలో మంత్రులుగా పనిచేసిన అక్కన్న, మాదన్నల కార్యాలయం కూడా వుంది. 1674వ సంవత్సరంలో గోల్కొండను పరిపాలించిన అబ్దుల్ హసన్ తానీషా కొలువులో భద్రాచలం తాలూకా తహశీల్దారుగా పనిచేసిన కంచర్ల గోపన్నను (భక్తరామదాసు) నిర్బంధించిన చెరసాల వుంది. దీనికి ఎగువన అర్ధచంద్రాకార వలయంలో ఇబ్రహీం కుతుబ్ షాహీ మసీదు వుంది. కోటలో అత్యంత ముఖ్యమైన భాగం బరాదరి. దీనినే విధానసభ అని కూడా పిలుస్తారు. ఇది మూడు అంతస్తుల భవన సముదాయం. ఇక్కడ నుండి గోషామహల్ కు సొరంగ మార్గం వుంది దీనినే 'గోషామహల్ బరాదరి హైదరాబాద్' సొరంగం అని పిలుస్తారు. శత్రువులు దాడి చేసినప్పుడు నిజాం ప్రభువులు ఈ మార్గం ద్వారానే గోషామహల్‌కు పారిపోయేవారు. దీని పైఅంతస్తులో రాజసింహాసనం వుంటుంది. ఇక్కడి నుండి కోట నాలుగు చెరగుల సుమారు 30 మైళ్ళ దూరం వరకు అత్యంత రమణీయంగా హైదరాబాద్ నగరం కనబడుతుంది. చార్మినార్, మక్కామసీద్, ఉస్మానియా వైద్యశాలలు చక్కగా కనిపిస్తాయి. తూర్పు దక్షిణ దిశగా మీర్ ఆలం చెరువు, ఫలక్‌నుమా భవనం, దక్షిణంగా మకై దర్వాజా, దక్షిణ పడమర దిశగా తారామతి, ప్రేమామతి భవనాలు, ఉస్మాన్ సాగర్ చెరువు కనిపిస్తాయి. కింది భాగంలో *గోల్కొండలో తలమానికంగా నిలిచే భవన సముదాయం* ఉంది. ఈ భవన గోడలకు వైబ్రేషన్ సిస్టం కలదు. ఒక పక్క చెవులు ఆనించి రెండో పక్క మాట్లాడితే గోడలలో గుండా ఇప్పటి టెలిఫోన్ లాగా చాలా స్పష్టంగా మాటలు వినబడతాయి. బాలాహిసార్ గేటుకు ఎడమ భాగంలో మూడు అంతస్థుల భవనం కలదు. ఇది అప్పటి ఆయుధాగారం ఇక్కడే తుపాకులు ఫిరంగులు దాచి వుంచేవారు.

సుమారు ఐదు శతాబ్దాల పాటు పరిపాలించిన నిజాం ప్రభువుల కళాచాతుర్యానికి నిదర్శనంగా నిలిచిన గోల్కొండ రాను రాను తన ప్రాభవం కోల్పోతోంది. నిజాం పరిపాలన అనంతరం ఇక్కడ నిధుల కోసం కోటను ధ్వంసం చేయటం నుండి ఇప్పటి వరకు సరైన రక్షణ చర్యలు లేక పూర్తిగా పాడైపోయింది. రాష్ట్ర పర్యాటక కేంద్రాలలో ప్రముఖంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న గోల్కొండలో సరైన నీటి వసతి, టాయ్‌లెట్ సౌకర్యం మృగ్యం. కోటను దర్శించే విదేశీ పర్యాటకులకు కోట ప్రాభవాన్ని వివరించడానికి గైడులు లేక పోవటం శోచనీయం. కొద్ది మంది గైడులు వున్నా అక్కడకు వచ్చే పర్యాటకులకు పూర్తి స్థాయిలో వివరించలేక పోవటంతో పర్యాటకులకు నిరాశ కలుగుతోంది. మంచినీళ్ళ బాటిళ్లు , ఇతర తినుబండారాల కవర్లను ఎంతో ప్రసిద్ధి గాంచిన బావులలో పడవేయడంతో అవి పూడి పోయే దశకు చేరుకున్నాయి. కోట దర్శనం పేరుతో టూరిస్టులనుండి టికెట్ల రూపంలో కోట్లాది రూపాయలు దండుకుంటున్న పర్యాటక శాఖ స్పందించి కోటలోని పరిశుభ్రతను కాపాడి, పెరుగుతున్న ఆకతాయిల ఆగడాలను అరికడితే కోటను దర్శించే వారి సంఖ్య పెరగవచ్చు. ఆదాయమే పరమావధిగా కాకుండా అక్కడకు వచ్చే వారికోసం కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు పటిష్టం చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. ◆

పునరుజ్జీవన దిశగా భారత హాకీ

✻ రాంప్రసాద్, ఎం.కె.

భారత్ ఒకానొకప్పుడు హాకీ క్రీడకు పెట్టిందిపేరుగా ఉండేది. భారత్ క్రీడా పటంలో దానికి ప్రత్యేక స్థానం ఉంది. అయితే మారిన పరిస్థితుల్లో హాకీ గత వైభవాన్ని కోల్పోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాటు యువకులు కూడా క్రికెట్ పట్ల విశేష ఆదరణ కనబరుస్తూ హాకీని పట్టించుకోవడం మానివేశారు. దీంతో భారత్ హాకీలో వెనకడుగు వేసింది. పొరుగున ఉన్న పాకిస్తాన్ మాత్రం కొంతకాలం ఈ క్రీడలో రాణించింది. చాలాకాలం భారత్‌కు గట్టిపోటీ ఇచ్చింది. తరువాత ఆ దేశంలోనూ పరిస్థితులు మారిపోయాయి. అక్కడ కూడా క్రీడలు అంటే క్రికెట్టేనా అన్న విధంగా పరిస్థితులు మారిపోయాయి.

ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన రెండంచెల ఇన్విటేషనల్ హాకీలో భారత్ పాత వైభవాన్ని తిరిగి సాధించే దిశగా సాగుతోందా అన్న ఆశలు రేకెత్తాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్ అనూహ్యంగా రాణించి సెకండ్ లెగ్ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించి టైటిల్ కైవసం చేసుకుంది. ఫస్ట్‌లెగ్‌లో కూడా ఫైనల్‌కు చేరుకుని ఆసీస్ చేతిలోనే ఘోర్షపరాజయం మూటకట్టుకుంది. అయితే సెకండ్‌లెగ్‌లో భారత్ అద్భుతంగా ఆడటంతో టైటిల్ చేజిక్కించుకోగలిగింది. విజయాలు వచ్చినపుడు ఉల్లాసంగానే ఉంటుంది. అయితే ముందున్న సవాళ్లను అనుక్షణం గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. వచ్చే ఏడు ఏథెన్స్ ఒలింపిక్స్ జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు భారత్ ఇంకా అర్హత సంపాదించుకోవాల్సి ఉంది. ఈ లోపు హంబర్గ్ టోర్నమెంట్, ఆగస్టులో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్నాయి. ఈ రెండు టోర్నమెంట్లు భారత్‌కు అగ్నిపరీక్ష వంటివి. లోపాలను అధిగమించి ఒక జట్టుగా కలసికట్టుగా ఆడగలిగితేనే ఇన్విటేషనల్ కప్ ఆనందం మిగులుతుంది. భారత జట్టులో సీనియర్స్‌కు స్థానం కల్పించడంపై అనవసర వివాదం చోటు చేసుకుంటోంది. ఆస్ట్రేలియా టోర్నమెంట్‌లో నలుగురు సీనియర్లకు స్థానం కల్పించారు. ఇందులో మాజీ కెప్టెన్ ముకేష్ కుమార్‌ను జట్టులోకి తీసుకోవడంపై వివాదం చెలరేగింది. తనను నిర్లక్ష్యం చేశారని, ఇది తనను గాయపరిచిందని అతడు పేర్కొన్నాడు. కోచ్ వైఖరికి విసిగి వేసారిన ముకేష్ హంబర్గ్ టోర్నమెంట్‌లో తాను పాల్గొనబోనని ప్రకటించాడు. భారత జట్టు బలహీనతల విషయానికి వస్తే కీలకసమయాల్లో పొరపాట్లు చేయడం భారత్‌కు అటు క్రికెట్, ఇటు హాకీలో జరుగుతోంది. పెర్త్‌లో జరిగిన ఫస్ట్‌లెగ్ టోర్నమెంట్ ఫైనల్లో భారత్ జట్టు గెలుపుబాటలో పయనిస్తుండగా చివర్లో క్రీడాకారులు ఏమరుపాటుగా వ్యవహరించి వరుసగా మూడు గోల్స్ చేసే అవకాశాన్ని ఆస్ట్రేలియాకు ఇచ్చారు. ఇన్విటేషనల్ కప్‌లో ఈ అనుభవం భారత్‌కు రెండుసార్లు ఎదురైంది. ఈ లోపాన్ని అధిగమించితేనే జట్టు రాణించ గలుగుతుంది. డిఫెన్స్ విషయంలో భారత్ ఇప్పటికీ బలహీనంగా ఉంది. దీనిని పటిష్టం చేసుకుంటేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉండగలదు. భారత్ ముమ్ముందు విశ్వవిజేత జర్మనీ, ఆస్ట్రేలియాతో తలపడాల్సిఉంది. అర్జెంటీనా కూడా ఇటీవలి కాలంలో భారత్‌కు గట్టిపోటీదారుగా మారింది. ఇక సింథటిక్ మైదానాల్లో ఆడటం భారత్‌కు అలవాటు లేదు. గ్రౌండ్‌లో ఆడటం ప్రారంభించినప్పటి నుండి భారత్ హాకీ తిరోగమనం ప్రారంభమైంది. 1980 ఒలింపిక్స్‌లో తొలిసారిగా సింథటిక్ గ్రౌండ్‌పై ఆడటం ప్రారంభించారు. రష్యా ఒలింపిక్స్, 1988లో జరిగిన సియోల్ ఒలింపిక్స్‌లో భారత్ పేలవంగా ఆడింది. ఆస్ట్రోటర్ఫ్ మైదానాల్లో ఆడే అనుభవం లేకపోవడమే ఇందుకు కారణం. పైగా అవసరమైన వసరులు లోపించడం కూడా భారత్ వెనకబడి పోవడానికి మరో కారణం. ఇప్పటికీ మనం ఇతర దేశాలతో పోలిస్తే వసరుల విషయంలో చాలా వెనకపడి ఉన్నాం. ఈ విషయంలో మార్పు ఉంటే మినహా భారత్ అగ్రగామి దేశాల పోటీకి తట్టుకుని నిలబడటం కష్టం. ప్రతి నగరంలోనూ ఆస్ట్రోటర్ఫ్ మైదానాలు ఏర్పాటు చేయడం కూడా సాధ్యం కాని పని. ముందే చెప్పుకున్నట్లు ప్రభుత్వం కూడా హాకీ విషయంలో అంటీఅంటనట్లుగా ఉంటుంది. తగిన నిధులు కేటాయించడంలోనూ, క్రీడాకారులను ప్రోత్సహించడంలోనూ ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. టెలివిజన్‌లో కవరేజ్ విషయంలోనూ పక్షపాతం ప్రదర్శిస్తున్నారు. స్పాన్సరర్స్ లేకపోవడం కూడా భారత్ హాకీ దిగజారడానికి కారణంగా ఉంది. బలమైన పాకిస్తాన్‌తో తరచూ మ్యాచ్‌లను ఆడటం కూడా భారత్‌కు ప్రయోజనకరంగా ఉంటుంది. నలుగురు సీనియర్లను క్రమశిక్షణను ఉల్లంఘించారన్న కారణంగా పక్కన పెట్టడంతో ఇన్విటేషనల్ కప్‌లో ఆ జట్టు బాగా వెనకపడింది. రెండు అంచెల్లోనూ ఘోరంగా విఫలమైంది. అయినా ఆ జట్టును తక్కువగా అంచనా వేయడం పొరపాటు కాగలదు. పాకిస్తాన్‌తో ఆడిన అనుభవం నుండి భారత్ ఎంతో నేర్చుకోగలుగుతుంది. పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా ఎలా మలచాలనే విషయంలో పాకిస్తాన్ నుండి మనం నేర్వవలసింది ఎంతో ఉంది. ఇటీవలి కాలంతో పోలిస్తే భారత్ జట్టు ఆటతీరు ఎంతో మెరుగు పడిందన్నది తిరుగులేని నిజం. ఇదివరకటికంటే మెరుగ్గా భారత్ అటాకింగ్ ఆట ఆడుతోంది. పెనాల్టీ కార్నర్ల విషయంలో కూడా మెరుగుదల కనిపిస్తోంది. అయితే షార్ట్ కార్నర్ల విషయంలో లోపాన్ని చక్కదిద్దుకోవాల్సి ఉంది. బిమల్ లక్రా, ఇగ్నేష్ టిర్కే, జుగ్‌రాజ్ సింగ్, వీరేన్ రస్కిన్హా బాగా రాణిస్తున్నారు. భారత జట్టు భవిష్యత్ ఈ యువకుల భుజస్కంధాలపైనే ఉంది. అయితే దిలీప్ టిర్కే డిఫెన్స్ ఇంకా మెరుగుపడాల్సి ఉంది. ఏమైనా ఆస్ట్రేలియాలో రాణించిన భారత జట్టుపై అభిమానుల ఆశలు, అంచనాలు ఎక్కువగానే ఉంటాయి. ఈ ఒత్తిడిని తట్టుకుంటూ మేటి జట్లను ఎలా అడ్డుకుంటుందనే విషయంపైనే భారత జట్టు భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. ◆

మెరుపు

✻ శ్రీలత

"నేను ముండమొయ్య" నిక్కచ్చిగా చెప్పింది లక్ష్మి.

"మొగుడు జచ్చినంక ముండమొయ్యక బిడ్డను మోస్తావే బడవదానా! ఎవరన్న గిట్ల ఇనిరంటే నీకన్నముందుగా నా నోట్లే ఉవ్మేన్తరు! గిట్ల వెంచినవ్ బిడ్డనంటనని" తల్లి ఒక్క కసురు కసిరింది.

"ఎవనికి ముండమొయ్యాలె! గా నర్సింలు గాన్ని నేను జూడనే జూడలే! గానికి నేనేంటికి ముండమోస్త?" చికాగ్గా అడిగింది తల్లిని!

"కొడ్తినాంటె మూతిపల్లు రాల్తయి మల్ల, నీవు జూడకున్నా గాడు నీ మొగుడే, సూసినా నీ మొగుడే" అంది తల్లి. చేతిలోని పళ్ళాన్ని విసిరికొట్టింది లక్ష్మి.

"వదినె! ఓ వదినె! లచ్చిమేమిజేస్తుంది! మొగోల్లు తొందర జేస్తుండ్రు చానపొద్దయిందాంటనని! పిల్లను కాల్వకు తీస్కపోవద్దా? తల్లి బిడ్డలు ముచ్చట్లు వెట్టిండ్రు" మేనత్త అక్కసు వెళ్ళగక్కింది.

కాలువకెందుకు వెళ్ళాలో తెలుసు లక్ష్మికి. తన గాజులు పగలగొట్టి, పూలు తెంపేసి బొట్టు చెరిపేసి, గజ్జెలు పీకేసి స్నానం చేయించి తెల్లచీర కట్టి తలపైనుండీ కింద వరకూ గొంగడి కప్పి వూరిలో ఎవ్వరికీ మొహం కనిపించకుండా తల వంచుకుని ఇంటికి తేవడానికి. దాన్నే "ముండమొయ్యడం" అని చాలా స్పష్టంగా తెలుసు. తనకేం ఇవ్వాలో తెలుసుకొని తల్లిదండ్రులు తనకేం తీసెయ్యాలో బాగా తెలిసిన వాళ్ళకీ తెలుసు!

"వన్తుందుండవే! ఇగో గిది ముండమొయ్యనంటూంది" అంది లక్ష్మి తల్లి!

"నేను సమజాయిన్త! నీవన్ని తయారుజెయ్యిపో" అంది మేనత్త లక్ష్మి దగ్గరకెళ్తూ! చేతినిండా రంగు రంగు గాజులు! తల్లో జాజిపూలు, మొఖానికి ఈ తొమ్మిది రోజుల నుండీ పసుపు రుద్దగా వచ్చిన పసిమిరంగు లంగా జాకెట్‌లో పుత్తడి బొమ్మ పూర్ణమ్మలా ఉంది లక్ష్మి. మేనత్తను చూసి మూలకు ముడుచుకుంది.

"అశె లచ్చిమి! చెప్పిన మాట ఇనె! చెప్పి చెప్పి మా గొంతులువాయె గాని, నీ చెవులల్ల మాట జొర్రకుంది! ఆళ్ళ ముందర నీవు ముండమోస్తె ఆళ్ళకూ నీమీన ప్రేమ ఉంటది. బతికినన్ని దినాలు మా కొడుకుకు ముండమోసెనాంటనని జాలి తోన నీకు పొట్ట జరుపుతరు. నామాట ఇను బిడ్డా" అంది మేనత్త!

"అల్లు ఇచ్చెడిది నీవె దీస్కోని నీవె ముండమొయ్యిపో" ఒక్క కసురు కసిరింది మేనత్తను. మేనత్తకు చిర్రెత్తుకొచ్చింది. ఇలా సర్ది చెప్పడం మొదలెట్టి వారమయ్యింది అందరూ. లక్ష్మి కుచ్చు లంగా కుచ్చెళ్ళు సవరిస్తూ, గోరింటాకు పెట్టుకున్న చేతికొనసళ్ళు చూసుకుంటూ కూర్చుంది!

నలుగురూ ఏవయినా అనుకుంటారని 'ఏడువుపిల్లా' అని అటూ ఇటూ చూసి వాళ్ళ చిన్నమ్మ తొడగిల్లింది. వాళ్ళ చిన్నమ్మవైపు కోరగా చూసి మళ్ళీ తన పనిలో పడింది.

నరిసింహులుతో లక్ష్మి పెళ్ళయి రెండు సంవత్సరాలయింది. లక్ష్మి పెళ్ళి లక్ష్మి ప్రమేయం లేకుండానే జరిగింది. పత్తి తోటలో క్రాసింగ్ చేస్తున్న

లక్ష్మి దగ్గరకు వాళ్ళ చెల్లెలు పరుగెత్తుకు వచ్చి చెప్పింది!

"లచ్చిమక్కా! ఓ లచ్చిమక్కా! నిన్ను నర్సింహులు గానికిచ్చి పెండ్లి జేస్తరంట! అల్లు, అడగనీకె వస్తే నాయన ఇస్తనన్నడు" అని చెప్తే "జరిగె" అని మొగ్గలకు అడ్డంగా ఉన్న చెల్లెలి లంగా తీసి పడేసి పని ఆపకుండా క్రాసింగ్ చేస్తూ పోయింది! ఏ మాత్రం రియాక్షన్ లేకుండా!

"లచ్చిమి పెళ్ళావే?" అని తన తోటి పిల్లలు అడిగితే

"అవ్వ! మా నాయన మాయక్కనువాళ్ళకీయనీకె ఒప్పుకున్నాడు" అందా పిల్ల! అందరూ లక్ష్మి చుట్టూ చేరి "మమ్ముల ఇడ్చిపెట్టి పోతవావె" అనడిగేరు ఆత్రంగా!

"నీయవ్వలెయండే" అని వాళ్ళను కసిరి పనిలో పడిపోయింది. అసలప్పటికి పెళ్ళి అంటే తను తెచ్చేకూలి తెచ్చి, అమ్మానాన్నకు ఇవ్వడం మానేసి, అత్తా మామకు ఇవ్వాలి. అమ్మ ఇంట్లో ఉండడం మానేసి అత్తగారింట్లో ఉండాలి. కూలికిపోయే హడావిడిలో ప్రొద్దునే లేచి అమ్మ వాకిలూడ్చి అంట్లుతోమి వంట చేసే పనులు అత్తగారింట్లో చేయాలి. కూలంతా అమ్మా నాన్నకిచ్చి రబ్బరు బాండ్లకూ, గాజులకూ, అప్పుడప్పుడూ సినిమాలకు అమ్మానాన్నను బ్రతిమాలి తీసుకునే డబ్బులు అత్తమామను బ్రతిమాలి తీసుకోవాలి. ఇవ్వకపోతే అమ్మతో దెబ్బలాడినట్లు అత్త, మామతో దెబ్బలాడకూడదు. ఇంతవరకే తెలుసు లక్ష్మికి. సినిమాల్లో హీరో హీరోయిన్ పాటలు ఆటలూ చూసి "గవన్నీ సీన్మల జేస్తరు! నిజంగ జెయ్యరు" అని తన తోటి పిల్లలు చెప్పుకోవడం వల్ల చాలా చాలా పనులు సినిమాలోనే చేస్తారు అనే అభిప్రాయంలోనే ఉన్న చిన్న వయసది.

జత పిల్లలందరూ ఒక్క చోట కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ "పెండ్లయినంక ఏంజెయ్యాలె" అనే టాపిక్ వస్తే "కూలి దీస్కపోయి అత్తమామకియ్యాలె" అని టక్కున సమాధానం వచ్చాక "మల్ల మొగునితోన ఏంజెయ్యాలె" అని రహస్యంగా అడుగుకుంటె, కాస్త పెద్ద పిల్ల "ముద్దియ్యాలె" అని అంటె "నీయవ్వ దానికి సిగ్గులేదు శరం లేదు. సీన్మల జేసేడివన్నీ జెయ్యాలంటది" అని ఆ అమ్మాయిని చుట్టుముట్టి కొట్టేవాళ్ళు! అదో కానిపని, అది చెయ్యకూడని పని అని తెలిశాక "నిన్నడగకుండగనే నీ మొగుడది జేస్తడు" అని పెద్దవాళ్ళు పరాచికమాడితే మొగుడంటే చెయ్యకూడని పని చేసేవాడు అనే అభిప్రాయంలో మొగుడి పేరు చెబితే పరమకోపం తెచ్చుకుని తిట్టేవయసది. "సమర్తయినంక దీస్కపోతం" అని లక్ష్మి అత్తగారి తరపు వాళ్ళంటే, వీళ్ళూ ఒప్పుకొన్నారు.

ఆ వయసులో పెళ్ళి పీటలమీద కూర్చున్న మొగుగుడ్ని తల తిప్పి చూడకుండా పెళ్ళిచేసుకోవడం ఆడపిల్ల జీవితాలల్లో జరుగుతుందంటే ఈ కాలంలో నమ్మకపోయినా నిజమది. లక్ష్మి జీవతంలోనూ అది జరిగింది. సంవత్సరమయ్యాక,

లక్ష్మి పెద్దమనిషయ్యనపుడు "నీ పెండ్లాంసవర్తయింది ఓపాలొచ్చిపో" అని అమ్మా నాన్న భర్తకు కబురు పంపిస్తే

"నేను సమర్తయితే ఆడికేంటికి జెప్పాలే?" అని చర్రున కోపం తెచ్చుకున్న పసివయసది.

"మా పిల్లగాడు లేడు. ఉప్పర మేస్త్రి కింద పని చెయ్యనీకె బొంబాయి వోయిండు" అని లక్ష్మి మామ చెప్పాడు తిరుగు టపాగా!

"మాకు జెప్పకుంటే వాయె! వాని పెండ్లానికన్న జెప్పిపోగూడదా?" అని లక్ష్మి మేనత్త కోపం తెచ్చుకుంది.

"ఆడు మా మాట ఇననీకె చిన్నపిల్లగాడా తల్లీ! బొంబయి పోయిండెప్పుడో, మేస్త్రి పనికి గుదిరిందెపుడో, ఆడ సోకుల పిల్లకు మరిగిందెప్పుడో మాకు గూడ్కంగ తెల్వకుండా లక్ష్మి మామ నిట్టూర్చాడు "మల్ల మావిల్ల ఏంగావలె" అని లక్ష్మి తరుపువాళ్ళడిగారు! "మీ పిల్లకు మొగుణ్ణి మలుపుకునే వగలుంటే వాడే వొస్తాడు! లేకుంటే గదంతే" అని చెప్పడంతో నిజమేననిపించి "ఆ రాత్రికి ఆ రోజు వచ్చిన ఐట్వాడా పట్టుకుని పిల్లను తీసుకుని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో లక్ష్మి మామ ఇచ్చిన నంబరిచ్చి

"జర గీ నెంబరుకు ఫోను చేసి నర్సింలుగానిలె అంటేపిలుస్తరంట నాయనా. మా అల్లుడు నర్సింలు గీల్లతాన పనిజేస్తడు" అని ఆ అబ్బాయినడుక్కుని ఆ అబ్బాయి లైను కలిపాక ఫోన్ లాక్కుని

"నర్సింలు ఓ నర్సింలు మీ యత్తను మాట్లాడుతండ....." అని అరిచింది లక్ష్మి తల్లి.

"గట్లగాదు "అలో అలో" అనాలె గక్కడదిక్కు "అలో అలో" అన్నంక మాట్లాడాలె" అని చెప్పి ఎలాగోలా మొత్తానికి నర్సింలు లైన్‌లోకి వచ్చేలా చేసాడతను!

"నీ పెండ్లం సమర్తయిందిరా వచ్చిపోవా?" అనడిగింది అత్త!

"నాకే పెండ్లమొద్దు! గది పల్లెటూరుది" అని నర్సింలు చెప్పగానే లక్ష్మి చేతికి ఫోనిచ్చి "ఆశె! నీ మొగుణ్ణి రమ్మని పిలువే" అని చెవిలో గొణిగింది లక్ష్మి తల్లి. లక్ష్మి చేతిలోకి ఫోనొచ్చింది తెలవక నర్సిహులు "ఓలి గట్టి గా పిల్లనిడుస్త" అని వినబడేసరికి టక్కున ఫోను పెట్టేసింది లక్ష్మి.

"మొగున్ని విలువే అంటే మూల్గవేందే" అని తల్లి లక్ష్మి నెత్తిమీద మొట్టింది.

"ఆడు నా మొగుడుగాదుపో" అని ఇంటికేసి పరుగెత్తింది. "దీనితోన సంసారమెట్ల జెపియ్యాలె దేవుడా" అని తల్లి తత్తర పడుతుండేది!

"మా పిల్లగాడు సాంచమీని కెల్లి పడి సచ్చిపోయిండంట! పీనుగను పంపనీకే చాతగాక ఆడ్నే తగల వెట్టింద్రంట. మరి మీ పిల్లను ముండమోపియ్యనికె మేము దీస్కపోవాలె పంపిస్తరా?" అని లక్ష్మి అత్తగారింటి నుంచీ ఆరు నెల్ల కబురొచ్చింది! అందరూ గుండెలు పగిలేలా ఏడ్చారు లక్ష్మి తప్ప!

లక్ష్మికి కళ్ళుకూడా చెమర్చలేదు. "ఓలి గట్టిగా పిల్లను ఇడ్చిపెడ్త" అనే మాటలు చెవిలో మోగి ఇంకాస్త గట్టిపడిపోయింది లక్ష్మి మనసు. ఈ పదిరోజుల్లోనూ ఒక్కరోజు కూడా ఏడ్వలేదు. అందరూ కలిసి మూలక్కూర్చోపెట్టి ఏడుస్తూంటే అందర్నీ అలాగే చూస్తూండిపోయింది.

పదకొండోరోజుమాత్రం తెగేసి చెప్పింది "నేను ముండమొయ్యను" అని!

"మీ పిల్ల మా పిల్లగానికి ముండమోస్తే పదిగొల్లలు తోల్తం ఆడి పేరు మీన! ముండమొయ్యకుంటే ఇంగ గాయమ్మకూ మాకూ సంబంధం లేదు" అని వాళ్ళత్తగారు అనడం తెలిసి "పదిగాదు పదిగేను గొఱ్ఱెలిస్తె ముండమొస్తది మాపిల్ల" అని కబురుపెట్టారు లక్ష్మి తరపు వాళ్ళు! "పదేను గాదు ఇద్దర్కి నడుమ పదమూడు" అని వాళ్ళు ఒప్పుకున్నాక ఈ రోజు ఈ కార్యక్రమం మొదలెట్టారు. లక్ష్మి బ్రతుకుకు మంచిబేరం కుదిరిందనుకున్నారు.

"లెయ్యి! నా మాట ఇనే! పదమూడు గొర్రెలుంటె మంచి ఆస్తున్నట్ల లెక్క మన గొల్లోల్లల్ల! గని సంపాయించనీకె సగం బతుకువడ్తది. గవి మేపుకోని బతకొచ్చు నీవు!" సముదాయించి లేపాలని చూపింది మేనత్త అప్పటికీ కదలకపోవడంతో బయటకెళ్ళి అన్నకు చెప్పింది. అంతే లక్ష్మి తండ్రి ఒక్కుదుటన లోపలికొచ్చి

"లెయ్యే! నీ కోసాన్కి పదమూడు గొర్రెలు బేరమాడినా! నా మాట నిలువవానే!" అని జుట్టుపట్టుకున్నాడు. ఒక్కుదుటన పైకి లేపి గోడకు తలనునొక్కి పెట్టాడు "ఏమంటవ్ ముండమోస్తవా? నా సేతల సస్తవా?" అడిగాడు ఏదయినా చావే సన్నసంగతి ఊహించకుండా! "సస్తా" అన్నది లక్ష్మి!

"దాన్ని గొట్టకయ్యా! గది మొండిది! నేను సముదాయిస్త" అని లక్ష్మి నాయనమ్మ అడ్డు తగిలింది.

"ఎవ్వరు సముదాయించెదవసరం లేదు. అందరూ తయారున్నారు దీన్ని బయటకు గింజ్కరండి" అని లక్ష్మి జుట్టు వదిలేసి గుడిసె బయటికెళ్ళి పోయాడు. నాయనమ్మ లక్ష్మి చేయిపట్టి గుడిసె వెనుక వైపుకు తీసుకుపోయింది. "రాను రాను" అని గించుకుంటున్న లక్ష్మికి చూపుడు వేలు పెట్టి చూపించింది. ఆ వేలు, కూలిన మొండి గోడను చూపిస్తూంది. ఆ గోడకు దూరంగా మేనత్త కొడుకు సత్యం నిలబడి ఉన్నాడు. "ఓరి సత్తెం!" చెయ్యి ఊపింది లక్ష్మి నాయనమ్మ! దగ్గర కొచ్చాడు సత్యం కాళ్ళు కడియాలు, వెండి ఝుంకీలు, కొప్పు బిళ్ళ తీసి చేతిలో పెట్టింది. కొంగులో దాచిన ఎండిన జొన్నరొట్టె ముక్కల మూట కూడా చేతికిచ్చి లక్ష్మి చేయి పట్టి మొండిగోడ ఎక్కించింది. అటు నుంచీ సత్యం లక్ష్మి నడుంపట్టుకుని దింపాడు. లక్ష్మి వెనక్కి తిరిగి నాయనమ్మవైపు చూసింది. అడ్డం పడుతున్న లంగా కుచ్చెళ్ళు ఎత్తి పట్టుకుంది. పసితనం పోని మనవరాలివి అపురూపంగా చూసుకుంది నాయనమ్మ!

"సంసారమంటె తెలియకపోయె నా మనుమరాలికి! ముండమొయ్యనీకె తయారు జేస్తుంద్రందరు! నీవె దీన్ని ముత్తయిదువు జేయ్యరా సత్తెంగా" అంది

"నీ విదువు అవ్వా! చేసెడిది చేస్తా! నేను లచ్చిమిని దీస్కోని రేపు పొద్దుగాల వస్త!" అని లక్ష్మి చెయ్యి పట్టుకుని పరిగెత్తుకెళ్ళి రోడ్డు మీద వెళ్ళే లారీ ఆపి లక్ష్మిని ఎక్కించి తను ఎక్కాడు.

గుడిసె గుడిసెంతా గోలయ్యింది. బజారంత గోలయ్యింది. ఊరు ఊరంతా గోలయ్యింది రెండోసారి! మొదటిసారి గోల, విధవ అవ్వాల్సిన లక్ష్మి కనబడకుండా పోయినందుకు. రెండోసారి బంతిపూల దండలతో లారీ దిగిన లక్ష్మి, లక్ష్మి బావ సత్యంను చూసినందుకు. కథ ఇలా ముగుస్తుందని ఎవరూ ఊహించలేదు లక్ష్మి నాయనమ్మ తప్ప. నల్లటి ఆమె మొహంలో తెల్లని వెన్నెలలాంటి నవ్వు. తెల్లవారిన లక్ష్మి బ్రతుకులో పచ్చని మెరుపు! ◆

బొల్లా ప్రగడ వెంకట రమణికి ఎంతో ఆనందంగా ఉంది.

తాను కోరుకున్న టీచర్ ఉద్యోగం లభించింది.

బి.ఇడి. పూర్తి చేసిన తర్వాత ఎంతో పోటీ పడి కష్టపడి రాసిన పరీక్షకు ఫలితం దక్కింది. ఒక నెలరోజుల్లో ఏదో ఊరిలో టీచర్‌గా బాధ్యతలు స్వీకరించాలన్న వూహ ఆమెకు ఎంతో ఆనందం కల్గజేస్తోంది.

ఉద్యోగం చేయాలని, అలా చేస్తే ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తుందని... ప్రతి స్త్రీకి అది ఎంతో అవసరమని రమణి నమ్ముతుంది.

✻ పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

గురుబ్రహ్మ

ఉద్యోగం వస్తే షిర్డీ వెళ్ళి బాబాను దర్శించుకుంటానని మొక్కుకుంది. *విధి నిర్వాహణలో చేరితే కుదరదని ఆమెకు తెలుసు.*

తండ్రి సోమేశ్వరరావు దగ్గరికి వెళ్ళి – "నాన్నా! మన షిరిడీ ప్రయాణం ఎప్పుడు?" అడిగింది.

"ఎందుకు?"

"పరీక్ష రాసినప్పుడు మొక్కుకున్నాను కదా! టీచర్‌గా సెలక్ట్ అయ్యాను అందుకే వెళ్ళాలి..." అంది.

సోమేశ్వరరావు దీర్ఘంగా ఆలోచించారు.

"అదేమిటి నాన్నా... డబ్బులు లేవా?"

"డబ్బులు సమస్య కాదమ్మా! అక్కలందరూ ఇంజనీర్లు... ఇతర ఉద్యోగాల వైపు మొగ్గు చూపిస్తే నువ్వు మాత్రం ఏరి కోరి టీచర్ ఉద్యోగంలో చేరావు... అదే ఆలోచిస్తున్నాను.. ఆ ఉద్యోగం అంటే అంత ఇష్టం ఎలా ఏర్పడిందా అని..." అన్నారు.

"టీచర్ ఉద్యోగంలో గొప్ప థ్రిల్లు ఉంది నాన్నా... పాపం... పుణ్యం... ప్రపంచ మార్గం ఏమీ తెలియని చిన్న పిల్లల్ని విద్యావంతులుగా విజ్ఞాన ఖనులుగా తీర్చిదిద్దడంలో గొప్ప తృప్తి ఉందనుకో... అందుకే ఈ ఉద్యోగం అంటే ఎనలేని ఇష్టం నాన్నా!" రమణి అంది.

"అమ్మా! రమణీ! ఈ ఉద్యోగాన్ని ఇంతలా ప్రేమించే నీకు గొప్ప గురుబ్రహ్మను చూపిస్తాను..నీకు ఎంతో స్ఫూర్తి కలుగుతుంది..." సోమేశ్వరరావు చెప్పారు.

✻ ✻ ✻

కర్నాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఇండి తాలూకాలో అదర్గా చిన్న పల్లె...

రమణి... సోమేశ్వరరావు బస్సు దిగగానే ఎదురుగా దేవాలయం కనిపించింది – 'ఇదే మనం దర్శించవలసిన గుడి" అన్నారు సోమేశ్వరరావు.

గుడి ముందు సమాధి ఉంది.

పాలరాతితో నిర్మించి చుట్టూ వరండాతో అందంగా నిర్మించారు. చాలా మంది భక్తులు దానిచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

దేవాలయంలో రేవణ సిద్ధప్ప వెండి ప్రతిమ

రమణి తండ్రితో కలస ప్రదక్షిణలు చేసింది.

అందరితో కలిసి పాలరాతి పలకమీద కూర్చున్నారు.

దానికి ఆనుకుని దేవాలయం... భక్తులు... అర్చనలు చేస్తూ పూజారి...

"నాన్నా! గుడికి వెళదాం పద!" లేచి నిల్చుంది. గుడిలోకి వెళ్ళి దేముడి స్థానంలో వున్న విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయింది రమణి.

ఒక వృద్ధుడి వెండి ప్రతిమ... వెంకటేశ్వరస్వామి విగ్రహం మాదిరిగా అలంకరణ ఉంది.. కింద ఊదొత్తులు.. కొబ్బరి చిప్పలు.. పూజా సామాగ్రి అన్నీ ఉన్నాయి.

"నాన్నా! ఎవరీయన... ఏ దేవుడు!"

"అందుకేనమ్మా! షిర్డీ వెళదామన్న నిన్ను ఇక్కడికి తీసుకువచ్చాను.. ఎంతోమందికి ఇతను దేవుడు... నీలాంటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడు.."

రమణి ఆశ్చర్యంగా చూసింది.

పూజారి అర్చనలు చేసి ప్రసాదం అందించారు. అప్రయత్నంగా అందుకుంది రమణి.

గుంపులు గుంపులుగా వచ్చి దేవాలయంలో పూజలు అర్చనలు చేయిస్తున్నారు. మరో పక్క మైకులో భక్తి గీతాలు వినిపిస్తున్నాయి.

రమణీ, సోమేశ్వరరావులు దేవాలయం అరుగు మీద చాలాసేపు కూర్చుండిపోయారు. ఆమెకు ఎంతో విస్మయంగా ఉంది. ఒక వ్యక్తికి పూజలు జరగడం... దేవాలయం నిర్మించడం ఆశ్చర్యంగా ఉంది.

"ఇతను గొప్ప వ్యక్తి..ఉపాధ్యాయుడు... టీచరు మంచివాడు అయితే ఎంతటి ఆదరణ లభిస్తుందో చెప్పడానికి ఇక్కడికి తీసుకువచ్చాను..." సోమేశ్వరరావు

"ఈయన ఉపాధ్యాయుడా?" రమణి ప్రశ్న పూర్తి కాకముందే వృద్ధ పూజారి అక్కడికి వచ్చి 'అవునమ్మా!' అన్నాడు.

ఇద్దరూ లేచి పూజారికి నమస్కరించారు.

అప్పుడు పూజారి చెప్పడం ప్రారంభించాడు.

✻ ✻ ✻

రేవణ సిద్ధప్ప మనగోళి అనే గ్రామంలో

(మిగతా 23వ పేజీలో)

సంగీత పూదోటలో 'విజయ' విహారం

24 గంటల 'విజయ' గీతాలాపన

ఆ రెండు రోజులూ 'విజయ' వాహినీ తరంగాలు అశేష జన ప్రవాహ హృదిని తాకి సవ్వడి చేశాయి. స-రి-గ-మ-ప-ద-ని-స'ల అవరోహణ, ఆరోహణ తెలియని వారిని సైతం పాడుతా తీయగా అంటూ స్వర విన్యాస గళంతో ఉరకలెత్తించాయి. ఒకటా రెండా దాదాపు మూడు వందల సినీ గీతాల రసగుళికల్ని ప్రేక్షకులకు పంచిన ఆ గాత్రం తెలుగు నేలపై అరుదైన రికార్డును సొంతం చేసుకొంది. పాటల పల్లకిలో ఊరేగుదాం "రా... రమ్మంటూ" చల్లని పన్నీరు చల్లిన ఆ గొంతు ఎవరిదో కాదు మన 'విజయలక్ష్మి'దే. దాదాపు మూడు దశాబ్దాలుగా నీరాజనాలందుకొంటున్న అంతర్జాతీయ గాయనీమణి 'విజయలక్ష్మి' నిర్వహించిన 24 గంటల నిర్విరామ సంగీత విభావరి కార్యక్రమం సంగీత లోకంలో సరికొత్త రికార్డు నెలకొల్పింది.

రాష్ట్రంలో ప్రతిష్టాత్మక సాంస్కృతిక సంస్థగా భాసిల్లుతున్న 'సంగమ్ అకాడమీ' సంస్థ 100వ కార్యక్రమంగా జూన్ 14, 15వ తేదీలలో హైదరాబాద్ రవీంద్రభారతి వేదికపై సంజయ్ కిషోర్ ఏర్పాటు చేసిన "విజయలక్ష్మి-24 గంటల సంగీత విభావరి' - కార్యక్రమం ప్రేక్షకులకు మరచిపోలేని మధురానుభూతిని పంచింది. విజయలక్ష్మి సుదీర్ఘ స్వరవిన్యాసానికి రవీంద్ర

జోరుమీదున్నావు తుమ్మెదా
నీ జోరెవరికోసమే తుమ్మెదా...

భారతి ఆడిటోరియం సైతం ప్రేక్షకుల తాకిడికి తట్టుకోలేక 'బాపురే' అంటూ నినదించింది.

విజయలక్ష్మి గొంతులో వేయిగొంతులు

ఈ టీవీ ఏంకర్‌గా, సినీ, టీవీ నేపథ్య గాయనిగా, 'ప్రేమాడాట్‌కామ్' ఆల్బమ్ కళాకారిణిగా, జీటీవి సరేగామా, స్టార్‌ప్లస్ మేరే ఆవాజ్ సునో విజేతగా అంతర్జాతీయ సంగీత శ్రోతలకు సుపరిచితమైన విజయలక్ష్మి 'గళం' వైవిధ్యానికి ప్రతిరూపం. తెలుగు సంగీత ప్రపంచాన్ని ఏలిన అలనాటి గాయనీమణులు రావు బాలసరస్వతీదేవి, పి.లీల, భానుమతి, పి.సుశీల, ఎస్.జానకి, జమునారాణి, ఎల్.ఆర్.ఈశ్వరి, వాణీ జయరామ్ అలాగే ఉత్తరాది గాయనీమణులైన నూర్జహాన్, లతాజీ, ఆశాభోంస్లే, ఉషా ఉతుప్, ఇలా అరుణ్. తదితర స్వర'వీణ'ల గొంతుల్ని యథాతథంగా పులికించగలిగే సత్తా భారతదేశంలో ఒక్క విజయలక్ష్మి గాత్రంలోనే ఉందన్న సత్యాన్ని ఎన్నో అద్భుత గీతాలాపనతో ఈ 24 గంటల నిర్విరామ సంగీత కార్యక్రమంలో విజయలక్ష్మి నిరూపించారు.

ఎందరో మహానుభావులు... అందరికీ...

"జోరు మీదున్నావు తుమ్మెదా... నీ జోరెవరికోసమే తుమ్మెదా..." అంటూ గాన కోకిల సుశీలమ్మ ప్రశ్నించినా, సిరిమల్లెపువ్వా... అంటూ మధురగాయని జానకి పిలిచినా 'జాణవులే నెరజాణవులే... అంటూ జిక్కీ ఆశీర్వదించినా... అందమే ఆనందం... ఆనందమే జీవిత మకరందం... అంటూ పి.లీల లీలగా శృతి చేసినా... వీణవేణువైన సరిగమ విన్నావా... అంటూ గాన గంధర్వుడు బాలు అడిగినా విజయలక్ష్మి కోసమేనట. అలనాటి పాతతరం గాయనీ విదుషీమణులంతా 'విజయలక్ష్మి' కోసం ఏకమై '24 గంటల' సంగీత కార్యక్రమంలో పాల్గొని ప్రేక్షకులకు చక్కని రసానుభూతిని పంచారు. ఇక ఎల్.ఆర్.ఈశ్వరి సంగతంటారా... ఎస్కో... కోకోకోలా అంటూ గాయని విజయలక్ష్మి సంగీత దాహాన్ని తీర్చేందుకు ప్రయత్నించారు... ఇలా చెప్పాలంటే చాలా ఉన్నాయి. 'నభూతో... నభవిష్యతి'.

వైవిధ్య గళాల సమాహారం

ఒక రాత్రి... ఒక పగలు ఏకబిగిన సాగిన విజయలక్ష్మి సంగీత విభావరిలో 12 గంటల పాటు జానకి పాటలు పాడి ఇంతకుముందే రికార్డు నెలకొల్పిన సురేఖామూర్తి, వినోద్‌బాబు, రామాచారి, రమణ, మిత్ర, మోహన్, తదితర గాయనీ గాయకులు, అలాగే సంగీత దర్శకుడు కోటి, మాధవపెద్ది సురేష్, టీవీనటి కిన్నెర, అనంత్, మంత్రి బాబూమోహన్, మాజీ పార్లమెంట్ సభ్యులు పి.వి.రాజేశ్వరరావు సహగాయకులుగా లీనమై 'స్వర' సంఘీభావాన్ని చాటారు.

- వీర్ల గంగాధర్

మా పాట నీ నోట పలకాల సిలకా

వ్యక్తిత్వం

* వి.కృష్ణయ్య

ఆత్మీయతకు రూపం ఎం. హెచ్.



"హలో బాగున్నారా? ఏం చేస్తున్నారు....." అని చిన్న పాప నుండి ముదుసలి వరకు కనిపించిన ప్రతివారినీ ఆత్మీయంగా, ఆప్యాయంగా పలకరించే గంభీరమైన కంఠం మూగబోయి నేటికి రెండు సంవత్సరాలు అయిందంటే నమ్మలేకున్నాము.

1989 ప్రారంభం నుంచి కా॥ ఎం.హెచ్.గారి నాయకత్వాన ప్రజాశక్తిలో ఒక కార్యకర్తగా పని చేసే అవకాశం పార్టీ నాకు కల్పించింది.

ఆయన జీవిత చరమాంకంలోని దశాబ్దం కచ్చితంగా చెప్పాలంటే 12 సంవత్సరాల కాలంలో అనేక విలువైన అనుభవాలు మాలాంటి కార్యకర్తలు నేర్చుకోవడానికి దోహదపడింది.

గ్లోబలైజేషన్ ప్రభావం సమాజంలో గ్రామస్థాయిదాకా చేరుతున్నది. జాతీయోద్యమ స్ఫూర్తి, గాంధీ, సుందరయ్య స్ఫూర్తికి బదులు బిల్‌గేట్సు ముందుకొస్తున్న నేపథ్యంలో కార్మికవర్గ, రైతాంగ హక్కుల కోసం పోరాడితే గాని బ్రతకలేని పరిస్థితి ప్రపంచీకరణను నెత్తినెత్తుకొన్న దేశాలలో పరిస్థితి చూస్తున్నాం.

ఈ తళుకుబెళుకులు, వెండితెరలు వాస్తవాలను దాచలేవు. పైకి ఏం చెప్పినా పులి మేక పిల్లను తినటానికి వస్తుందే గాని దాన్ని ఆదుకొనటానికి రాదని చరిత్ర నేర్పించిన సత్యం.

ఈ నేపథ్యంలో నేటి యువతరం కా॥ఎం.హెచ్. గారి లాంటి విశిష్ట వ్యక్తుల నుంచి స్ఫూర్తి పొంది పోరాటాలకు సన్నద్ధం కావలసి ఉంది.

మార్క్సిజం, సోషలిజం గురించి, ఒక నిరంతరం మండే జ్వాలలాంటి ఉద్వేగం ఆయనలో ఉంది. ఆయన వ్రాసే ఎడిటోరియల్స్, రాజకీయ వ్యాఖ్యానాలు ఎంతో వాడిగా, వేడిగా ఉండేవి.

సోవియట్‌లో సోషలిస్టు ప్రభుత్వం పడినప్పుడు శషభిషలలో ఉన్న అనేకమంది కామ్రేడ్స్ ఆలోచనలకు స్పష్టత, శత్రువుపై ఎదురుదాడికి ఆ రోజు ఎడిటోరియల్ బ్రహ్మాస్త్రమైంది.

ఆ రోజు ఉదయం జరిగిన చర్చల అనంతరం మధ్యాహ్నం 2 గం॥లకు బయలుదేరి ఇంటికి వెళ్లవలసింది బదులు కాఫీ తెప్పించుకుని కలం పట్టారంటే ఆ రోజు రాబోతున్న ఎడిటోరియల్ వాడి వేడి ఆ సమయంలో మండే సూర్యుని ప్రతాపాన్ని పోలి ఉండేది. అదే జరిగింది ఆ రోజు.

సిద్ధాంతాలకు, చరిత్రకు సంబంధించి ఎలాంటి వక్రీకరణలు సహించరు. ఒకసారి సోవియట్ నుండి కమ్యూనిస్టు పార్టీ నాయకులొకరు వచ్చి పెరిస్ట్రోయికా బ్యాక్‌గ్రౌండ్‌లో సోవియట్ పరిణామాలపై విజయవాడలో రాష్ట్ర విస్తృత సమావేశంలో మాట్లాడటం జరిగింది. వెంటనే రాష్ట్ర కమిటీ వేసి వారు మాట్లాడిన విషయాలలో పొరపాటును ఎత్తిచూపి, ఇలాంటి వారిచే క్రింది క్యాడర్‌కు ఉపన్యాసాలు చెప్పించకూడదని తీర్మానించి కేంద్రకమిటీకి పంపడం జరిగింది. ఆయన చొరవతో ఇది జరిగింది.

కార్యకర్తలతో ఆప్యాయంగా ఉండటం ఆయనలో కొట్టొచ్చినట్టు కనిపించే సుగుణం.

రాష్ట్రంలో ఏ మూలకు పోయినా ఆయనను గుర్తుంచుకునేవారు కనిపిస్తారు. కార్యకర్తలను సూదంటురాయిలా ఆకర్షించటంలో, పార్టీతో నిలబెట్టుకోవడంలో ఈ పద్ధతి ఎంతో దోహదపడింది. కార్యకర్తల ఇళ్లల్లో ఎలాంటి కార్యక్రమాలైనా ఆహ్వానిస్తే వెళ్లేందుకే ప్రయత్నించేవారు. ఆ సందర్భాలలో ఆ కుటుంబ సభ్యులు ఆయనతో అన్నీ చెప్పుకోవాలనిపించేట్లుగా వారితో కలిసిపోయి మాట్లాడేవారు. ఎదుటివారితో మనం ఎంత గౌరవంగా, ఆప్యాయంగా ఉంటే వారు కూడా అలా ఉండటానికి ప్రయత్నిస్తారు. ఈ విధానాన్ని సాధన చేయటానికి అందరూ ప్రయత్నించాల్సి ఉంది.

ఆయన ఇతర పార్టీలలో ఉన్న పెద్దలు, మిత్రులతో మంచి స్నేహభావంతో ఉండేవారు. వారితో అలా కాంటాక్ట్ మెయిన్‌టెయిన్ చేసేవారు. వాటిని క్యాడర్ అవసరాలకు దోహదపడేలా చేసేవారు. ఉదాహరణకు డాక్టర్లతో ఏర్పడిన పరిచయాలను ఎంతోమంది కార్యకర్తల ఆరోగ్య రక్షణ కోసం ఉపయోగించేవారు.

ఎంత ఆప్యాయంగా ఉంటారో అంత సునిశితంగా కూడా ఉంటారు. ఎదుటివారిలో సిద్ధాంత, నిర్మాణ విషయాలలో ఏ మాత్రం బలహీనతలు కనిపించినా సున్నితంగా ఎత్తిచూపేవారు. ఆచరణలో మార్పు లేకుంటే చాలా కఠినంగా ఉండేవారు. పార్టీలోను, ప్రజాశక్తిలోను అలాంటి సన్నివేశాలు ఎన్నో చూశాము. ఐక్యత - పోరాటమనే సూత్రాన్ని చాలా పరిపక్వతతో అమలు జరిపేవారు. సమావేశాలలో ఎన్ని విభేదాలొచ్చినా బయటకు రాగానే ఆప్యాయంగా పలకరించేవారు. అది అందరికీ సాధ్యమయ్యేది కాదు.

సంఘర్షణలో సమాజం ముందుకు పోతుందని మార్క్సిజం చెబుతుంది. పార్టీ అంతరంగిక పోరాటంలో పార్టీ అభివృద్ధి చెందుతుంది. వాస్తవాలకు దగ్గరగా నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ కమిటీలలో అంతరంగిక పోరాటం సాధన చేయాలని పార్టీ చెబుతున్నది. సిద్ధాంత, నిర్మాణ ఐక్యత పెరగటానికి అంతరంగికపోరాటం చాలా అవసరమని తెలిసినప్పటికీ చాలా మంది కామ్రేడ్స్ దానిని సాధనంగా స్వీకరించకపోవడం చూస్తున్నాం. చిన్న విమర్శలు వచ్చినా తట్టుకోలేకపోవడం చూస్తున్నాం. పార్టీలో నిరంతరంగా సాగాల్సిన ఈ ప్రక్రియను అనేకమంది కామ్రేడ్స్ అర్థం చేసుకోలేకున్నారు. ఎంత మంచి వజ్రమైనా హారంలో ఒదగాలంటే సాన పట్టాల్సిందే. మనం పీల్చిన గాలిలోని ఆక్సిజన్‌ను ఉంచుకుని, కార్బన్ డై ఆక్సైడ్‌ను ఎలా వదులుతామో అలాగే పార్టీ కమిటీలలో వచ్చే చర్చలలో వాస్తవాలను, అవాస్తవాలను నిరంతరం వేరు చేస్తేనే పార్టీ ముమ్ముందుకు పోతూ ఉంటుంది.

ఎం.హెచ్.గారు మహిళలను ప్రోత్సహించే తీరు మనం వేరే చెప్పనవసరం లేదు. ఉదయం గారు సాధారణ స్కూలు విద్యతో రాష్ట్ర ప్రజానీకంలో గుర్తింపు కలిగిన నాయకురాలుగా ఎదగడానికి ఆమె చొరవ, ఎం.హెచ్.గారి స్ఫూర్తి, సహాయ సహకారాలు ఎంతో తోడ్పడ్డవి. 'నాన్న, అమ్మలుగా', 'అన్నయ్య, అక్కలుగా' వారిద్దర్ని కామ్రేడ్స్ ఎందుకు పిలిచేవారో నాకు కొన్నాళ్లు అర్థం కాలేదు. దగ్గరగా పరిశీలించిన తర్వాత సమాజంలో కొరవడిన ఆప్యాయతను వీరి వద్ద పొందుతుండటంతో వారికి అయాచితంగా వచ్చిన బిరుదులయ్యాయి.

చదువుకున్నవాళ్లు ఏదో ఒక ఉద్యోగం

చేయాలని, చదువురాని వాళ్లు మన వల్ల ఏమౌతుందని ఉద్యమానికి దూరంగా వుంటున్న రోజులలో చదువుతో సంబంధం లేకుండా కుటుంబాలు కుటుంబాలుగా ఎలా పార్టీలో పని చేయాలో వీరి జీవితం నుంచి నేర్చుకోవాలి.

ఆయనతో ఏ మాత్రం బంధుత్వమున్నా వారిపై కూడా రాజకీయ ప్రభావం పడింది. ఆయన వారితో మెలిగే తీరు రీత్యా వారు ఆయనను వ్యక్తిగతంగా గౌరవించడంతో పాటు పార్టీని గౌరవించడం కనిపించేది.

వారి పిల్లలైన డా॥ లావణ్య, డా॥ఉష గార్లు వారి నాన్న యెడల, పార్టీ కార్యకర్తల యెడల అపారమైన గౌరవాన్ని కలిగి ఉండేవారు. మనకు కనిపించే కారణం చిన్నతనం నుంచి వారి మనస్సులపై ముద్ర వేసిన ఎం.హెచ్.గారి ఆప్యాయత, అనురాగం, ఆయనిచ్చిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం. అవసరంలో కష్టంగా ఉన్నా ఉద్యమంలో ఉన్న తల్లిదండ్రులకు వేరే మార్గం లేదు.

ప్రజాశక్తిలోనైనా, పార్టీ ఆఫీసులలోనైనా క్రింద కేడర్ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. అందువలన వారు ఎం.హెచ్.గారు చెప్పిన పనులు చేయటానికి ఆతురతగా ఉండేవారు. గౌరవభావంతో ఉండేవారు.

పత్రిక నడపటంలో గాని, ప్రజా ఉద్యమాలలో గాని కీలక అంశాలపై చర్చించుతూ రోజువారి వ్యవహారాలలో జోక్యం చేసుకునేవారు కాదు.

తెలుగు, ఇంగ్లీషు భాషలపై స్పష్టత, పట్టు ఉండేది.

ఒకసారి ఇంగ్లీషు నుండి తెలుగు పుస్తక అనువాదాలు ఎలా ఉండాలి అనేదానిపై ఒక చర్చ జరిగింది. ఆ వాదోపవాదాలన్నీ విన్న తర్వాత ఏది తప్పో, ఏది రైటో అర్థం కాని పరిస్థితి. ఎం.హెచ్.గారితో కమిటీ కూర్చున్నప్పుడు 'అర్థం మారిపోకుండా, చదువరులకు అర్థమయ్యే భాషలో అనువాదాలు ఉండాలనేది ఎం.హెచ్.గారు చెప్పిన తర్వాత స్పష్టత వచ్చింది.

ఇంకొకసారి సోవియట్‌పరిణామాలపై వచ్చిన ఇంగ్లీషు పుస్తకం నేను చదివి బాగున్నదని ఎం.హెచ్.గారికిచ్చాను. ఆయన దానిని చదివి అందులో ఉన్న పొరపాట్లు ఏమిటో వివరంగా చర్చించారు. ఇంగ్లీషు పరిజ్ఞానం పైన, సోవియట్ చరిత్రలోని అంశాలపై, నాకున్న పరిమితులు, పొరపాట్లు అర్థమయ్యాయి. సోవియట్ సమాజం గురించి అంత మైక్రోగా ఆయనకున్న పరిజ్ఞానానికి ఆశ్చర్యం వేసింది. ఏ విషయాలు అయినా లోతుగా అన్ని కోణాల నుండి పరిశీలన చేయలేకపోవటం, తరచూ అనేక పొరపాట్లు చేస్తూ ఉండటం నుంచి బయటపడాలంటే ఎం.హెచ్.గారి లాంటి పెద్దల నుండి నేర్చుకోవాలి.

రాష్ట్రంలో వేర్పాటు వాదనలు, ఉద్యమాలు ప్రబలినప్పుడు ఆయన రచించిన "విశాలాంధ్రలో విషాద ఛాయలు'' అన్న గ్రంథం అత్యంత ప్రధానమైనది. పోరాడి సాధించుకున్న విశాలాంధ్రను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించుతున్న ఆ గ్రంథం ఇప్పటికీ అందరూ చదవవలసినది.

పార్లమెంటరీ రంగంలో ఆయన నిత్యం అనేక అంశాలపై సన్నద్ధమై చర్చకు వెళ్లేవారు. పార్లమెంటరీ కమిటీలకు అనారోగ్యంగా ఉన్నా సరే మన వాణిని వినిపించటానికని తప్పక వెళ్లేవారు.

గత 15 సం॥లలో ప్రపంచవ్యాపితంగా జరుగుతున్న మార్పులతో మన దేశంలోను, రాష్ట్రంలోను అనేక రంగాలలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పులను అధ్యయనం చేసి సరైన విధానాలు వివిధ స్థాయిలలో రూపొందించుకొని సామ్రాజ్యవాదం వేసే ఎత్తుగడను చిత్తు చేయకపోతే మనం ముందుకు సాగలేం. అధ్యయనం - పోరాటం కలిపి నడిపిన ఎం. హెచ్.గారి అధ్యయన స్ఫూర్తిని అన్ని స్థాయిలలో అలవర్చుకోవాలి.

నూతన పరిస్థితులకనుగుణంగా నూతన కర్తవ్యాలను చేపట్టి ఎం.హెచ్.గారి లాగా అంకిత భావంతో పని చేయడమే ఆయనకు మనం సమర్పించే నివాళి. ◆

గురుబ్రహ్మ

(20వ పేజీ తరువాయి)

1889లోజన్మించారు. చిన్నతనం నుంచి ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో మక్కువ. ప్రాథమికోన్నత స్థాయి చదువు పూర్తికాగానే ధారవాడ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందారు.

1909లో టెక్కలి గ్రామంలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. విద్యార్థుల పట్ల విశేష శ్రద్ధ కనపరచడంతో అప్పటి బ్రిటీష్ పాలకులు అదర్గా గ్రామంలో పదోన్నతిపై నియమించారు.

ఆ గ్రామంలో ఆయన ఎంతో చైతన్యాన్ని కలిగించారు. హోలీ పండగ సందర్భంగా రసాయనాలు కలిపి రంగునీళ్ళు చల్లుకునే సంప్రదాయానికి వ్యతిరేకంగా యువకుల్ని సమీకరించి వారిలో మార్పును తీసుకువచ్చారు. ఆ సమయంలో స్వాతంత్ర్య సంగ్రామం జరుగుతుండటంతో పరాయి పాలకుల్ని పారద్రోలాలని పిలుపునిచ్చి అందరినీ సమాయత్తం చేశారు. స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించారు. మహిళల్లో పొదుపు ఉద్యమం చేపట్టారు. బాలికల విద్యకోసం ఎంతో కృషి చేసి వారి ఇళ్ళకు వెళ్ళి పాఠశాలలకు రప్పించారు. ప్రతి మహిళా ఆ ఉపాధ్యాయుడ్ని తండ్రిగా గౌరవించేది.

రేవణ సిద్ధప్ప సమాధి... చుట్టు ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

రేవణ సిద్ధప్ప విద్యార్థులతోనూ, గ్రామస్తులతోనూ చర్చావేదికలు నిర్వహించే వారు. ప్రజలకు అన్ని విషయాల్లో అవగాహన కలిగించే వారు. గ్రామంలో ఏ తగవులు జరిగినా పరిష్కరించి తీర్పులు ఇచ్చేవారు. ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు.

వారందరూ కలసి పుస్తకాలను సమకూర్చి 'రేవణ సిద్దేశ్వర రీడింగ్ రూం' నిర్మించారు. బడి పిల్లలందరికీ అక్కడే అక్షరాభ్యాసం చేయించే వారు. జిల్లాలోనే ఈ రీడింగు రూం ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది.

గ్రామస్తుల అందరి మన్ననలను పొంది ఎవరితోనూ వ్యతిరేకత లేని రేవణ సిద్ధప్ప 1925 ఫిబ్రవరి 23న కీర్తిశేషులయ్యారు. శవాన్ని ఊరవతల దహనం చేయాలని కుటుంబ సభ్యులు అనుకున్నారు.

కాని ఎవరూ ఒప్పుకోలేదు. గ్రామం మధ్యలో మాస్టారి పార్థివ శరీరాన్ని సమాధి చేసి చలువరాతితో సమాధిని నిర్మించారు. ప్రతి ఇంటివారు ఆర్థిక సాయం చేసి మండపాన్ని కట్టారు. ఆయన విగ్రహాన్ని వెండితో చేయించి పక్కనే దేవాలయాన్ని నిర్మించి అందులో ప్రతిష్టించారు.

"1925 నుంచి సిద్ధప్ప మాస్టారి ప్రతిమ నిత్యం పూజలు అందుకొంటోంది. మాస్టారు లేకపోయినా ఆయన జ్ఞాపకాలున్నాయి. ఆయన చూపించిన ఆదర్శం... ఆయన మార్గం ఎదురుగా కనబడుతున్నాయి. ఆ విగ్రహాన్ని చూస్తుంటే ఎంతో భావోద్వేగం కలుగుతోంది. అందుకే ఈ దేవాలయంలో ప్రతిరోజూ నేనే మొదటి సందర్శకుడిని..." పూజారి చెప్పుకుపోతున్నాడు.

ఆ వృద్ధుడి చెంపల మీదుగా కన్నీటిబొట్లు...

సోమేశ్వరరావు రమణి కూడా అదే స్థితిలో ఉన్నారు.

గుడికి, గుడిలో దేవుడికి నమస్కరించి వెనుదిరిగారు.

***

"నాన్నా! నిజంగా దేవుడిని చూపించావు. ఇప్పుడు నా మనసు ఎంతో ఆనందంగా ఉంది..."

సోమేశ్వరరావు ఏమీ మాట్లాడలేదు.

"ఎక్కడో దేవుడు లేడు.. మనలో ఉన్నాడు... ఆ గ్రామస్తుల హృదయాల్లో రేవణ సిద్ధప్ప నిజంగా దేవుడై వెలిశాడు... నాకు గొప్ప స్ఫూర్తిగా ఉంది నాన్నా!"

"అందుకే కదమ్మా! నిన్ను ఇక్కడకు తీసుకువచ్చాను!"

"థాంక్స్ నాన్నా! ఉద్యోగం వచ్చిన ఆనందంలో నాకు గొప్ప కానుకనిచ్చావు. రేవణ సిద్ధప్పను ఆదర్శంగా నేను పని చేసే స్కూల్లో పిల్లల్ని తీర్చిదిద్దుతాను...." అంది.

కూతుర్ని దగ్గరికి తీసుకుని సోమేశ్వరరావు నుదుటి మీద ముద్దుపెట్టుకున్నారు. ◆

చాణక్యం

✻ కొండబాబు

"చిత్రకారులకు సామాజిక స్పృహ ఉండాలి. చిత్రకారులకే కాదు ఏ కళాకారుడికైనా అది అవసరం. సమాజంలో నుంచే కళలు సృజించాలి. ప్రత్యేకించి వ్యంగ్య చిత్రకారులకు సామాజిక నడకపై అవగాహన, తపన ఉండాలి..." ఇంగ్లీషులో సాగుతున్న ఆ ప్రసంగాన్ని సభలో కూర్చున్న శ్రీకర్ ఆసక్తిగా వింటున్నాడు.

ప్రసంగిస్తున్న వ్యక్తి ఒక జాతీయ దినపత్రిక కార్టూనిస్టు. తెలుగాయనే, వయసులోనూ, అనుభవంలోనూ తలపండిన వాడు. తెలుగు దినపత్రికలో కార్టూనిస్టుగా పని చేస్తున్న శ్రీకర్‌కు ఆయనంటే వల్లమాలిన అభిమానం.

సభ ముగిసింది. ముఖ్య అతిధిగా పాల్గొన్నాయన కిందికి దిగాడు.

శ్రీకర్ ఎదురుగా వెళ్ళి చేతులు జోడించాడు" సార్ నేను మీ శిష్యుణ్ణి" అన్నాడు.

ఆయన ఆశ్చర్యపోయాడు.

"అంటే... ఏకలవ్య శిష్యుణ్ణిసార్" ఆయన నవ్వుతూ షేక్ హ్యాండిచ్చాడు. శ్రీకర్ తన బొమ్మలను చూపాడు. ఆయన వెన్నుతట్టాడు.

* * *

కవులు, కళాకారులకు ఇలా 'ఏకలవ్య శిష్యులు'ండటం పరిపాటే. చాలా రంగాలకూ ఇది వర్తిస్తుంది.

'ఏకలవ్య శిష్యుల'నే పదాన్ని ఇలా అలవోకగా వాడేస్తారు ఎవ్వరైనా. మరి 'ఏకలవ్య శిష్యు'లంటే ఎవరు? అనేది ప్రశ్న. ఈ పలుకుబడిని వాడే కొందరికే దీని అర్థం తెలియకపోవచ్చు.

మహాభారత కథలో 'ఏకలవ్యుడు' ఒక పాత్ర. ఇతను గిరిజనుడు. విలువిద్య నేర్చుకోవాలనే కాంక్ష విపరీతంగా ఉండేది. గురువైన ద్రోణాచార్యుడు రాజపుత్రులకు మాత్రమే విలువిద్య నేర్పేవాడు. ఏకలవ్యుడికి ఆయన వద్ద అభ్యాసానికి అవకాశం ఇవ్వలేదు. దీంతో గురువుగారి బొమ్మను తయారు చేసుకుని.. ఆయనే తనముందు ఉండి నేర్పుతున్నట్లూ, దండిస్తున్నట్లూ భావించుకుని ఏకలవ్యుడు విలువిద్యలో ప్రావీణ్యం సాధించాడు. ద్రోణాచార్యుడి వద్ద నేర్చుకున్న అర్జునుడికి సమానంగా ప్రావీణ్యం సాధించాడు.

ఇలా ఎవరినో గురువుగా మనసులో భావించుకుని ఆయనను అనుకరిస్తూ, విద్యను నేర్చుకునే వారిని, నేర్చుకున్నట్లు ప్రకటించుకున్న వారిని ఏకలవ్యుడితో పోల్చుతూ 'ఏకలవ్య శిష్యులు' అంటారు. పురాణకథల్లోంచి పుట్టిన జాతీయం ఇది.

ఇలా మహాభారత కథ నుంచి పుట్టినవే మరికొన్ని ఉన్నాయి. అందులో 'దృతరాష్ట్ర కౌగిలి' అనేది ఒకటి.

'వాడితో స్నేహం దృతరాష్ట్ర కౌగిలి వంటిది' అంటారు. అంటే చెడు చేస్తాడని అర్థం.

కురుక్షేత్ర యుద్ధానంతరం కౌరవులందరూ చనిపోతారు. చివరకు దుర్యోధనుణ్ణి కూడా భీముడు చంపుతాడు. అది విని దుర్యోధనుని తండ్రి దృతరాష్ట్రుడు తట్టుకోలేకపోతాడు. మనసులో విపరీతంగా ఆగ్రహిస్తాడు. భీముణ్ణి దగ్గరకు రమ్మంటాడు ప్రేమ నటిస్తూ. శ్రీకృష్ణుడు భీముణ్ణి వారించి అతని స్థానంలో ఒక విగ్రహాన్ని దృతరాష్ట్రుడి ముందుకు నెడతాడు. దృతరాష్ట్రుడు భీముడనుకుని గట్టిగా కౌగిలించుకుంటాడు. ఆ విగ్రహం తునాతునకలవుతుంది. కాబట్టి ప్రేమకు చిహ్నమైన కౌగిలిని ద్వేషపూరితంగా మార్చిన ఆ సంఘటన లాంటి వ్యవహారాలను 'దృతరాష్ట్ర కౌగిలి' అని వ్యాఖ్యానిస్తుంటారు. ఎవరైనా మంచిగా దగ్గరకు తీసి చెడు చేసినపుడు ఈ జాతీయాన్ని వాడతారు.

'శకుని', 'శకుని మాయ' అని నామవాచకంలో ఉన్నా జాతీయాలూ ఉన్నాయి. కుట్రలు, కుయుక్తులతో మహాభారత యుద్ధానికి, కౌరవకుల నాశనానికి కారణమైన వాడు కౌరవుల మేనమామ శకుని. కుట్రలకు పాల్పడే వారిని 'శకుని' అంటుంటారు.

ఇలాంటిదే 'చాణక్యం'. గుప్త సామ్రాజ్యం నాడు 'చాణుక్యుడు' అనే మంత్రి ఉండేవాడు. చంద్రగుప్తుణ్ణి రాజుగా నిలపడంలో, శత్రువుల్ని తప్పుదోవ పట్టించి ఓడించడంలో ఈయనది అందెవేసిన చేయి. చాణుక్యుడి వ్యూహంలో యుక్తులు, కుయుక్తులు ఉన్నాయి. కాని 'శకుని'ని నెగెటివ్ అర్థంలోనూ, 'చాణక్యం'ను పాజిటివ్ అర్థంలోనూ... అంటే మంచికోసం అలా జరిగినప్పుడూ వాడతారు. 'చాణక్యం' అనే పలుకుబడి పత్రికల ద్వారానే ప్రాచుర్యం పొందింది.

జాతీయాల్లో ఇలా పాజిటివ్ సందర్భాల్లో వాడేది, నెగెటివ్ వ్యవహారాల్లో వాడేది రెండూ ఉన్నాయి. ఒక సందర్భానికి వేరొకటి వాడితే అపార్థాలకు ఆస్కారమిచ్చినట్లవుతుంది. కావున సరిగ్గా అర్థం తెలిసే వాడాలి. ◆

పాఠక స్పందన

'గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభను గుర్తించరా'

ప్రజాశక్తి సండే మ్యాగ్జైన్ రోజురోజుకు ఆసక్తికరమైన కొత్త కొత్త విషయాలను తెలియ చెప్తోంది. జూన్ 15వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'గ్రామీణ ప్రతిభను గుర్తించరా' అనే శీర్షిక చాలా బాగుంది. అది నాకెంతో ఆనందాన్ని కలిగించింది. గ్రామీణ ప్రజల్లో టాలెంట్ ఉండి కూడా ఉపయోగించుకోలేకపోతున్నారు. శిక్షణా శిబిరాలు పట్టణాల్లో తప్ప గ్రామీణ ప్రాంతాల్లో ఉండవు కదా. వారి ప్రతిభను పైకి తేవడం ఎలా?

– ఎ.సతీష్ బాబు, గజ్వేల్, మెదక్ జిల్లా.

అలరించిన కవర్ స్టోరీ

15 జూన్ 2003 ఆదివారం ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో కవర్ స్టోరీ శీర్షికన ప్రచురించిన మహిళా మేలుకో వరకట్నపు కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్న సామాన్య మహిళల జీవితాలకు ఇకనైనా విముక్తి కలిగితే చాలు. ఇంతకు మించిన ఆనందం మరొకటి లేదు. కట్నాలు పుచ్చుకొని కష్టాల పాలు చేస్తున్న కట్నాల పెళ్ళి కొడుకులకు కటకటాలలో కుళ్ళికుళ్ళి ఏడ్చేట్టు చేయగలగాలి నేటి మహిళా శక్తి.

– మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

భారత రాష్ట్రపతి డా॥ ఎ.పి.జె. అబ్దుల్‌కలాం కుప్పం పర్యటన విజయవంతం అయిన శుభ సందర్భంగా కృతజ్ఞతలతో...

ప్రగతిపథంలో కుప్పం నియోజకవర్గం

(1994 నుంచి 2003)

విద్య :

అక్షరాస్యత	- 30 శాతం నుండి 52కు పెంపు
ప్రాథమిక పాఠశాల	- 255-396
ప్రాథమికోన్నత పాఠశాల	- 27-88
ఉన్నత పాఠశాల	- 14-46
జూనియర్ కళాశాల	- 1-6
వైద్య కళాశాల	- 0-1
ఇంజనీరింగ్ కళాశాల	- 0-1
ఫలితాలు (10వ తరగతి)	- 43 శాతం నుండి 95కు పెంపు
(7వ తరగతి)	- 48 శాతం నుండి 99కు పెంపు
ద్రవిడ విశ్వవిద్యాలయం	- 0-1
పాలిటెక్నిక్ కళాశాల	- 0-1
అగస్త్య ఇంటర్‌నేషనల్ స్కూల్	- 0-1
మిషనరీ స్కూల్	- 0-1

ఆరోగ్యం :

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	- 5 నుండి 8
కుటుంబ నియంత్రణ	- 60 శాతం నుండి 100 శాతం
ఆసుపత్రి ప్రసవాలు	- 7 శాతం నుండి 77 శాతం
వ్యాధి నిరోధక టీకాలు	- 30 శాతం నుండి 100 శాతం
సి.బి.ఆర్.	- 23 నుండి 19.7
సి.డి.ఆర్.	- 10.2 నుండి 4.5
ఐ.ఎం.ఆర్.	- 68 నుండి 39.2
ఎం.ఎం.ఆర్.	- 3.2

వాటర్‌షెడ్ :

0 శాతం నుండి 80 శాతం

వ్యవసాయం :

వ్యవసాయ సాగు భూమి 40 శాతం నుండి 82 శాతం

స్ప్రింక్లర్ మరియు డ్రిప్ వ్యవసాయం 0 ఎకరాల నుంచి 8000 ఎకరాలకు పెంపు

పట్టు రైతులకు జాతీయస్థాయిలో గుర్తింపు.

ప్రతి 100 గ్రుడ్లకు 81 కేజీల పట్టు ఉత్పత్తి

ఎగుమతి పంటలు వేసి 13 కోట్లు (విదేశీ మారకద్రవ్యం) సముపార్జన

విద్యుత్ సర్వీసులు :

8 వేలు నుండి 22 వేలు విద్యుత్ కనెక్షన్లు

విద్యుత్ వినియోగం 68 లక్షల నుండి 1.63 కోట్లు యూనిట్లు

రక్షిత మంచినీటి సరఫరా :

20 శాతం నుండి 98 శాతం ప్రజలకు

పచ్చదనం :

38 శాతం నుండి 62 శాతం

రోడ్లు మరియు భవనాలు :

172 రోడ్లు సౌకర్యం లేని గ్రామాలకు రోడ్డు కల్పన

ఇప్పుడు అన్ని గ్రామాల్లో రోడ్డు వసతి

140 కిలోమీటర్ల నుండి 562 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణం

ఒక జాతీయ రహదారి

నీటి సంరక్షణ :

వర్షపాతం - సంరక్షణ 23 శాతం నుండి 62 శాతానికి పెంపు

ఊట చెరువులు 0 శాతం నుండి 78 శాతం చెరువులు

ఊట చెరువులుగా మార్చడంలో కుప్పం రైతులు దేశానికే ఆదర్శం

ఐ.టి.రంగం :

ఐ కమ్యూనిటీ ప్రాజెక్టు

విద్యావాహిని ప్రాజెక్టు

హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ప్రాజెక్టు

వరల్డ్ క్రాఫ్స్ - సి.ఐ.సి. సెంటర్ల ఏర్పాటు

భూసర్వే (జి.పి.ఎం.సర్వే)

సూక్ష్మ ప్రణాళిక

శ్రీ నారా చంద్రబాబునాయుడు

శ్రీ కోడెల శివప్రసాద్

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి

శ్రీ పి.వి. సత్యనారాయణమూర్తి ఐ.ఏ.ఎస్.
జిల్లా కలెక్టర్, చిత్తూరు,
చైర్మన్, కాడా, కుప్పం

ఎ.శరత్, ఎం.బి.ఎ.
ప్రాజెక్టు అధికారి, కాడా
కుప్పం